Published from Visakhapatnam
PRGI NO:APTEL/25/A1888

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




విశాఖపట్నం Visakhapatnam | సంపుటి : 01 Vol.No : 01 | సంచిక : 262 Issue No : 262 | గురువారం Thursday | సెప్టెంబర్ 17, 2026 17 SEPTEMBER 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## శ్రీవారి వైభవం

# మరింత పెరగాలి..



### మరో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణమే లక్ష్యం..

- ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల
- భక్తుల అనుభూతిని పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఈవీ బస్సులు అందించిన రిలయన్స్, భారత్ బయోటెక్
- తిరుమల వచ్చే భక్తులకు ఎల్ఐసీ ఆధ్వర్యంలో రూ.2 లక్షల బీమా
- సీఎం చంద్రబాబు


ప్రజాభూమి ప్రతినిధి,తిరుమల: తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు.

వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు.

వివరాలు 2లో..

## ఏపీ తీరం దిశగా

# అల్పపీడనం..




- ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- శనివారం సాయంత్రానికి అల్పపీడనం ఏర్పాటుకు సూచనలు
- ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం
- ప్రభావంతో వచ్చే వారం రాష్ట్రంలో వర్షాలు కురిసే ఛాన్స్
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిక వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేం దుకు అనువైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 19) సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

2 పేజీలో..

## విజయవాడ -హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌లో అగ్ని

# ప్రమాదం..

### తృటిలో తప్పిన పెను ప్రమాదం

- ఎలుక వైర్లు కొరకడంతో షార్ట్ సర్క్యూట్ అయినట్లు రైల్వే సిబ్బంది వెల్లడి
- అప్రమత్తమైన కిరణ్.. ప్రయాణికులను మేల్కొలిపి బయటకు తరలింపు
- చీకట్లో రైలు దిగడంతో తోపులాట.. పలువురికి స్వల్ప గాయాలు
- హడావుడిలో సెల్‌ఫోన్లు, బ్యాగులు పోగొట్టుకున్న ప్రయాణికులు

వివరాలు లోపల పేజీలో



హుబ్లీ : విజయవాడ నుంచి హుబ్లీ వెళ్తున్న ఎస్ఎస్ఎస్ హుబ్బళ్ళి ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 173 30)లో బుధవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రైలు బళ్లారి స్టేషన్ దాటిన సుమారు 15 నిమిషాల తర్వాత, రాత్రి ఒంటిగంట దాటిన సమయంలో A1 ఏసీ బోగీ లో షార్ట్ సర్క్యూట్ కారణంగా పొగలు రావ డంతో ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.




## ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై కాశీలో

# 'సేవా సంకల్ప్ అభియాన్'

'వారణాసి-వాద్నగర్ సేవా యాత్ర'లో పాల్గొనున్న సీఎం చంద్రబాబు

2 లో..



## నేపాల్‌లో వరుసగా రెండు భూకంపాలు

కాఠ్మాండు: వాయువ్య నేపాల్‌లో బుధవారం తెల్లవారుజామున వరుసగా రెండు భూకంపాలు సంభవించాయి. అయితే ఇప్పటివరకు ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు ఎలాంటి సమాచారం అందలేదు. జాతీయ భూకంప పరిశోధన కేంద్రం ప్రకారం..

2 పేజీలో..

## నెల్లూరులో ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్ పాఠశాలను ప్రారంభించిన

# మంత్రి లోకేష్

### వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి

ప్రజాభూమి ప్రతినిధి, నెల్లూరు :

నెల్లూరు కార్పోరేట్ హంగులతో నెల్లూరులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో శిథిలావస్తలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసి కార్పోరేట్ స్కూళ్లను తలపించేలా సకల సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. నెల్లూరు నగరంలో మొత్తం 15 ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే వీఆర్ సీ స్కూల్ ను ఆధునీకరించడం జరిగింది.

- మిగతా 2లో..





## కేసీఆర్ ఫాంహౌస్ భూములపై

# విచారణ..

### 30 రోజుల్లో నివేదిక : రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన

- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆరోపణ
- నెల రోజుల్లో విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచన
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతామని సీఎం ప్రకటన
- కల్వకుంట్ల కుటుంబానికి 439 ఎకరాలు ఉన్నాయని వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, తెలంగాణ : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు.

2 లో

# ప్రతి దశలోనూ.. రోగి భద్రత





- ఎన్‌సీడీ ద్వారా వ్యాధుల గుర్తింపు.. 'సంజీవని'తో నిరంతర వైద్యం
- మందుల భద్రత, సురక్షిత వైద్య విధానాలకు ప్రాధాన్యం
- సెప్టెంబరు 17న ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం
- ఆస్పత్రుల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- మంత్రి సత్యకుమార్

2 లో..

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : రోగికి వైద్యం అందించడం ఎంత ముఖ్యమో.. ఆ వైద్యం వల్ల ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధిని ముందుగానే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం, మందులను సురక్షితంగా వినియోగించడం, చికిత్స అనంతరం రోగి ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం ద్వారా రోగి భద్రతను బలోపేతం చేయాలన్నారు.

## విద్యుత్ శాఖలో ఉద్యోగుల సంక్షేమానికి

# పెద్దపీట



- కారుణ్య నియామకాల ద్వారా కూటమి ప్రభుత్వంలో 389 మందికి ఉద్యోగాలు
- 25 మందికి ఏపీసీపీడీసీఎల్ లో కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామకాలు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

వివరాలు లోపల పేజీలో

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ :

రాష్ట్రంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యుత్ రంగంలో మౌలిక వసతుల

# ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై కాశీలో 'సేవా సంకల్ప్ అభియాన్'

**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :** ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని వారణాసిలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనున్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానిగా ప్రజా జీవితంలో నరేంద్ర మోదీ చేసిన సేవలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాశీ నగరంలో వారణాసి--వాద్నగర్ సేవా యాత్రను చేపట్టారు. ప్రధాని మోదీ ప్రజా జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వారణాసి, వాద్నగర్‌ను అనుసంధానిస్తూ ఈ సేవా సంకల్ప్ అభియాన్ లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. యువత, ప్రజా ప్రతినిధులు, సేవా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ సంకల్ప్ అభియాన్ చేప్టటారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత కీలకమనే సందేశాన్ని 'సేవా సంకల్ప్ అభియాన్' ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. ప్రతీ గ్రామం, ప్రతి కుటుంబం, ప్రతి యువత, ప్రతి మహిళ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వామి కావాలనే స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు.

**సీఎం చంద్రబాబు వారణాసి పర్యటన**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేటి ఉదయం 7.30 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 9.35 గంటలకు వారణాసి చేరుకుంటారు. ముందుగా 11.15 గంటలకు వారణాసిలోని శ్రీ కాశీ విశ్వనాథుడ్ని ముఖ్యమంత్రి దర్శించుకోనున్నారు. అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ చేరుకుని సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత మధ్యాహ్నం 3.10 గంటలకు వారణాసి నుంచి బయలుదేరి 5.15 గంటలకు తిరిగి అమరావతి చేరుకోనున్నారు.

# విచారణ సెప్టెంబర్ 21కి వాయిదా

**న్యూఢిల్లీ : లోక్‌సభ ప్రతిపక్ష? నేత రాహుల్ గాంధీపై దాఖలైన పరువునష్టం కేసు విచారణను ఎంపి-ఎమ్మెల్యే కోర్టు సెప్టెంబర్ 21కి వాయిదా వేసింది. ఫిర్యాదుదారు తరపున న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో ఈ కేసు విచారణను వాయిదా వేసినట్లు ప్రత్యేక జడ్జి శుభమ్ వర్మ బుధవారం తెలిపారు. గురువారం వివిధ కోర్టుల్లో మరికొన్ని కేసులు విచారణకు ఉన్నాయని, దీంతో అదనపు సమయం కావాలని బిజెపి నేత, ఫిర్యాదుదారు విజయ్ మిశ్రా తరపున న్యాయవాది సంతోష్ కుమార్ కోర్టుకు తెలిపారు. దీంతో విచారణను సెప్టెంబర్ 21కి వాయిదా వేసేందుకు జడ్జి అంగీకరించారు. 2018 కర్ణాటక ఎన్నికల సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారంటూ విజయ్ మిశ్రా ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి ఈ కేసు కోర్టులో కొనసాగుతోంది.**

# నేపాల్‌లో వరుసగా రెండు భూకంపాలు


**ముగు జిల్లాలోని కలై ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని మొదటి భూకంపం తెల్లవారుజామున 1:51 గంటలకు సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.5గా నమోదైంది. అదే ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని రెండో భూకంపం తెల్లవారుజామున 4:28 గంటలకు సంభవించింది. దీని తీవ్రత 4.2గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. భూకంప ప్రకంపనలు పొరుగున ఉన్న దోల్పా, జుమ్లా జిల్లాల్లోనూ అనుభూతి చెందారు. అయితే ఈ ప్రకంపనల కారణంగా ఎలాంటి నష్టం జరిగినట్లు ఇప్పటివరకు సమాచారం లేదు. భూకంపాలు తరచుగా సంభవించే ప్రాంతంలో నేపాల్ ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా ప్రకంపనలు లేదా భవనాలకు నష్టం జరిగిందా అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు.**

# ఏపీ తీరం దిశగా అల్పపీడనం..

ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.

# కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ..

కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు.జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



# విజయవాడ -హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌లో అగ్ని ప్రమాదం..

సకాలంలో ప్రమాదాన్ని గుర్తించి ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. బోగీలో దుప్పట్లు అందజేసే కే. కిరణ్ ఆ సమయంలో మేల్కొని ఉన్నారు. సుమారు పది నిమిషాల వ్యవధిలో రైలు మూడుసార్లు ఆగడంతో తొలుత ఎవరో చైన్ లాగి ఉంటారని భావించినట్లు ఆయన తెలిపారు. అయితే మూడోసారి రైలు ఆగినప్పుడు అనుమానం వచ్చి బోగీలో అటువైపు వెళ్లి పరిశీలించగా పొగలు రావడం గమనించారు. వెంటనే సంబంధిత రైల్వే సిబ్బందికి సమాచారం అందించడంతో పాటు ప్రయాణికులను అప్రమత్తం చేశారు. దీంతో రైల్వే సిబ్బంది వెంటనే స్పందించి బోగీని పరిశీలించారు.

ప్రమాద తీవ్రతను గుర్తించిన రైల్వే సిబ్బంది గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులను మేల్కొలిపి, సామాను గురించి ఆలోచించకుండా వెంటనే రైలు నుంచి కిందకు దిగాలని హెచ్చరించారు. దీంతో ఒక్కసారిగా భయాందోళనకు గురైన ప్రయాణికులు రైలు నుంచి బయటకు దిగేందుకు ప్రయత్నించడంతో తోపులాట జరిగింది.

రైలు ఆగిన ప్రాంతంలో పూర్తిగా చీకటి ఉండటంతో పాటు పట్టాల పక్కన రైల్వే నిర్మాణ సామగ్రి ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి.

అత్యవసర పరిస్థితుల్లో రైలు దిగే సమయంలో కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. మరికొందరి ట్రావెలింగ్ బ్యాగులు, ఇతర సామగ్రి కనిపించకుండా పోయింది. కొందరు తమ విలువైన వస్తువులను బోగీలోనే వదిలి బయటకు రావాల్సి వచ్చింది. అగ్ని ప్రమాదాన్ని రైల్వే సిబ్బంది అదుపులోకి తీసుకుని, అవసరమైన మరమ్మతులు చేపట్టారు. బోగీలో సమస్యను సరిచేసిన అనంతరం ప్రయాణికులను తిరిగి రైలు ఎక్కాలని సూచించారు. అయితే అప్పటికే భయాందోళనకు గురైన ప్రయాణికులు రైలు ఎక్కేందుకు కొంతసేపు వెనుకంజ వేశారు. రైల్వే సిబ్బంది సమస్య పూర్తిగా సరిచేశామని, ఎలాంటి ప్రమాదం లేదని, తాము పర్యవేక్షిస్తామని ప్రయాణికులకు భరోసా ఇచ్చారు. రైలు ఎక్కిన అనంతరం కొందరు ప్రయాణికులు తమ బ్యాగులు, విలువైన వస్తువులను బోగీ నుంచి కిందకు విసిరుకున్నారు. మరికొందరు హడావుడిగా రైలు ఎక్కే క్రమంలో గాయపడ్డారు. రైలు మరమ్మతులు పూర్తయిన అనంతరం బయలుదేరే సమయంలో ప్రయాణికులకు సామాను సర్దుకునేందుకు, సురక్షితంగా రైలు ఎక్కేందుకు తగినంత సమయం ఇవ్వలేదని ప్రయాణికులు తెలిపారు. కేవలం టార్చ్‌లైట్ సహాయంతో సంకేతాలు ఇస్తూ కొద్దిసేపటికే రైలును కదిలించడంతో కొందరు తమ సెల్‌ఫోన్లు, బ్యాగులు పోగొట్టుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. బోగీలోని విద్యుత్ వైర్లను ఎలుక కొరకడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పొగలు వచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ కారణంగానే అగ్ని ప్రమాద పరిస్థితి ఏర్పడినట్లు చనిపోయిన ఎలుక ఫోటో చూపించారు సిబ్బంది తెలిపారు ప్రయాణికులకు భయం పోగొట్టేందుకు. కే. కిరణ్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పాటు రైల్వే సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రమాదం పెద్దదిగా మారకుండా నివారించగలిగారు. ముఖ్యంగా బోగీలో పొగలు వస్తున్న విషయాన్ని తొలిదశలోనే గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వడం, ప్రయాణికులను అప్రమత్తం చేయడం కీలకంగా మారింది. ట్రైన్లోని ఫైర్ ఎస్టింగ్విషర్ ద్వారా అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. గాఢ నిద్రలో ఉన్న సమయంలో బోగీలో పొగలు వ్యాపించిన విషయం ఆలస్యంగా గుర్తించి ఉంటే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉండేదని ప్రయాణికులు తెలిపారు. కిరణ్ అప్రమత్తత, రైల్వే సిబ్బంది తక్షణ చర్యలతో పెను ప్రమాదం తృటిలో తప్పింది.

# శ్రీవారి వైభవం మరింత పెరగాలి..

శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది. శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, వివిధ కాలాలకు చెందిన చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరించే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ముఖ్యమంత్రి తిలకించారు. శ్రీవారి సేవకోసం, స్వామి వారిని కీర్తించేందుకు ఆనాటి సంగీత కారులు వినియోగించిన వాయిద్య పరికరాలను కూడా మ్యూజియంలో సీఎం ఆసక్తిగా పరిశీలించారు.

**తిరుమలలో భక్తుల కోసం 32 ఎలక్ట్రిక్ బస్సులు :** తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈ-మోబిలిటీ సీఈఓ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సహా టీటీడీ సభ్యులతో కలిసి నారాయణ గిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సీఎం ప్రయాణించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందని సీఎం తెలిపారు. ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. దురదృష్టవశాత్తూ తిరుమలలో భక్తుడు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 5 వేల దేవాలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపడతామన్నారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి సేవకులను విద్య, వైద్య రంగాల్లోనూ వినియోగించుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆరు అంశాల్లో తిరుమల తిరుపతి దేవస్థాన కార్యకలాపాలను పునర్వవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# నెల్లూరులో ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్ పాఠశాలను ప్రారంభించిన మంత్రి లోకేష్

ఈ నేపథ్యంలో బుధవారం నెల్లూరు పట్టణం స్టోన్ హౌస్ పేటలో ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్ మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్ ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు నెల్లూరు ఎంపీ, వీపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల భవనాలను రిబ్బన్ కట్ చేసి మంత్రి ప్రారంభించారు. అనంతరం పాఠశాల మొత్తం కలియతిరిగి తరగతి గదులు, ల్యాబ్ లు, డైనింగ్ హాల్ ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరాతీశారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

**రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి :** వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ ను అభివృద్ధి చేయడం జరిగింది. రెండు అంతస్థుల్లో భారీ నిర్మాణంతో 43 తరగతి గదులు అందుబాటులోకి తీసుకువచ్చారు. విద్యార్థులకు డిజిటల్ బోధన అందించేందుకు ఎల్ఈడీ స్క్రీన్ లు, అధునాతన బెంచీలను ఏర్పాటుచేశారు. పాఠ్యపుస్తకాలకే విద్యను పరిమితం చేయకుండా ప్రయోగాత్మక, సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్, లాంగ్వేజ్ రూమ్‌లు తదితర ప్రత్యేక వసతులను కల్పించడం జరిగింది. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ మోడ్రన్ టాయిలెట్లను ఏర్పాటుచేశారు.

**విశాలమైన క్రీడా ప్రాంగణం అభివృద్ధి :** చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలనే లక్ష్యంతో పాఠశాలలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడం జరిగింది. ఎకరా స్థలంలో ప్లేగ్రౌండ్ ఏర్పాటుచేయడంతో పాటు ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులు సిద్ధం చేశారు. అదనంగా కిడ్స్ ప్లే ఏరియా, సెన్సరీ పార్క్, అవుట్‌డోర్ జిమ్ వంటి ఆధునిక సదుపాయాలను కల్పించారు. సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టు ఏర్పాటుచేశారు.

**ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఆధునిక సదుపాయాల కల్పన :** నర్సరీ నుంచి పదో తరగతి వరకు విద్యాబోధనకు అనువుగా పాఠశాలను తీర్చిదిద్దడం జరిగింది. ఒకే ప్రాంగణంలో పాఠశాల విద్యకు అవసరమైన తరగతి గదులు, ల్యాబ్‌లు, గ్రంథాలయం, కళలు, క్రీడలు, డిజిటల్ విద్య తదితర సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ఆధునిక సదుపాయాలను వినియోగించుకోవాలన్న లక్ష్యంతో ఈ విద్యాయజ్ఞాన్ని మంత్రి లోకేష్ ముందుకు తీసుకెళ్తున్నారు.

**ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడాలి :** ఆధునీకరించిన పాఠశాలను ప్రారంభించిన అనంతరం పాఠశాల పనితీరుపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.ప్రసాద్, ఇతర అధికారులతో మంత్రి సమీక్షించారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో స్కూల్ వెనుకబడి ఉందని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గతేడాది పదో తరగతిలో 60.19 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంపుపై దృష్టిసారించాలన్నారు. స్టూడెంట్ ఎన్ రోల్ మెంట్ కూడా తగ్గిందని, ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంపైనా మంత్రి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రి పి. నారాయణ, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని విద్యుత్ శాఖ మంత్రిగొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

స్థానిక గుణదలలోని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ల్లో కారుణ్య నియామక ఉత్తర్వులు అందించే ప్రదాన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో చేపడుతున్న వివిధ ఉద్యోగ, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కారుణ్య నియామకాల ద్వారా 389 మందికి ఉద్యోగాలు కారుణ్య నియామకాల కింద తాజాగా 25 మంది ఉద్యోగార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాన్స్ కో, జెన్కో, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థల్లో ఇప్పటివరకు మొత్తం 389 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మరణించిన విద్యుత్ శాఖ ఉద్యోగుల కుటుంబాల్లో వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగి పిల్లలు చిన్న వయస్సులో ఉన్నా, అర్హత కలిగిన వయస్సుకు వచ్చినా వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన మరో 35 నుంచి 45 మందికి కట్‌ఆఫ్ తేదీని నిర్ణయించి ప్రత్యేకంగా పరిగణించి వారికి ఉద్యోగాలు కల్పించేందుకు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. 629 ఏఈ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించాం త్వరలో ఫలితాలు అందిస్తామని, విద్యుత్ శాఖలోని అన్ని విభాగాలను కలిపి 629 అసిస్టెంట్ ఇంజనీర్ (రాజు) పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించామని మంత్రి తెలిపారు.త్వరలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నియామక ప్రక్రియను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులకు మూడు డిఏ లు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎలక్ట్రిసిటీ విభాగం పనిచేస్తోందన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగులకు మెరుగైన శిక్షణ అందించేందుకు విశాఖపట్నంలో దాదాపు రూ. 30 కోట్ల వ్యయంతో ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మించామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగులకు నాణ్యమైన శిక్షణ అందించడమే దీని ఉద్దేశమన్నారు.

**గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహం :** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు సోలార్, విండ్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించే చర్యల్లో భాగంగా సుమారు 6 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాల కుటుంబాలకు సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా సుమారు రూ. 10,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ శాఖలో ఉద్యోగ నియామకాలతో పాటు ఉద్యోగుల సంక్షేమం, శిక్షణ, పునరుత్పాదక ఇంధన ప్రోత్సాహం, గ్రామీణ విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి, డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ & హెచ్ ఆర్ టీవీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్ వెంకటేశ్వర్లు, సీజీఎంలు, జీఎంలు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రతి దశలోనూ.. రోగి భద్రత

మొదటి పేజీ తరువాయి

ఎన్‌సీడీ 4.0లో ఇప్పటికే 2.83 కోట్ల మందికి పైగా పరీక్షలు నిర్వహించగా.. 59.38 లక్షల మందిలో అధిక రక్తపోటు, 48.32 లక్షల మందిలో మధుమేహం గుర్తించినట్లు తెలిపారు. వ్యాధి గుర్తించిన వారికి సకాలంలో వైద్యం అందేలా 'సంజీవని' ద్వారా సేవలను అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. సెప్టెంబర్ 17 ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా మంత్రి బుధవారం ప్రకటన విడుదల చేశారు. రక్తపోటు, మధుమేహంతో పాటు నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన వారికి ఎన్‌సీడీ 4.0 ద్వారా విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. క్యాన్సర్ పరీక్షల్లో అనుమానం ఉన్న వారిని తదుపరి పరీక్షలు, అవసరమైన చికిత్స కోసం పంపిస్తున్నామని చెప్పారు. వ్యాధి గుర్తించిన తర్వాత వైద్యం అందడంలో జాప్యం లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పరీక్షల్లో వ్యాధి ఉన్నట్లు తేలిన తర్వాత రోగికి తదుపరి వైద్యం అందడంలో ఎలాంటి అంతరాయం ఉండకూడదన్నారు. 'సంజీవని' ద్వారా పరీక్షలు, చికిత్స, మందులు, తదుపరి పర్యవేక్షణ వంటి సేవలను అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా వైద్యం పొందేలా సేవలను కొనసాగించాలని సూచించారు. ప్రతి రోగి ఆరోగ్య వివరాలను డిజిటలీకరణ చేస్తున్నామని తెలిపారు. సంజీవని ద్వారా రోగులకు ఆరోగ్య భద్రత మరిశీత పెరుగుతుందని చెప్పారు.రోగికి అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందడం చికిత్సలో కీలకమన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా రోగులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రోగులు తాము గతంలో తీసుకున్న చికిత్స, ప్రస్తుతం వాడుతున్న మందుల వివరాలను వైద్యులకు స్పష్టంగా తెలియజేయాలని, సొంతంగా మందుల మోతాదును మార్చడం లేదా నిలిపివేయడం చేయకూడదని తెలిపారు.

రోగి భద్రతలో రోగి, కుటుంబ సభ్యుల భాగస్వామ్యం కూడా ముఖ్యమన్నారు. రోగులు తమ ఆరోగ్య సమస్యలను వైద్యులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కుటుంబ సభ్యులు అండగా నిలవాలని తెలిపారు. మందులు సకాలంలో తీసుకోవడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనలు పాటించడంలో సహకరించాలని మంత్రి సూచించారు.

**ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాల పరిశీలన :** ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగి భద్రతకు సంబంధించిన విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చికిత్స సమయంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని సూచించారు. రోగి వివరాల నమోదు, మందుల భద్రత, చికిత్స విధానాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. మంచి విధానాలను గుర్తించి అన్ని ఆస్పత్రుల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా అన్ని జిల్లాలు, బోధనాస్పత్రుల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బందికి రోగి భద్రత, మందుల భద్రత, సురక్షిత వైద్య విధానాలపై అవగాహన కల్పించాలని మంత్రి సత్య కుమార్ సూచించారు.

ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా

గురువారం, సెప్టెంబర్ 17, 2026



# కలెక్టరేట్ లో ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్

**పారిశ్రామిక, వ్యాపార రంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక**

**సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపు**

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:
కృష్ణా జిల్లాలో పారిశ్రామిక, వ్యాపార రంగ అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించేం దుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్ట రేట్ లో ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి నేడొక ప్రకటన లో తెలిపారు.ఇటీవల కృష్ణా విశ్వవిద్యాలయం లో నిర్వహించిన 'వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్ప్రెన్యూర్' వర్క్‌షాప్‌కు లభించిన విశేష స్పందనకు కొనసాగింపుగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపిన కలెక్టర్, కొత్తగా వ్యాపారం లేదా పరిశ్రమ ప్రారంభించాలనుకునే ఔత్సాహికులు, ఇప్పటికే వ్యాపారాలు నిర్వహిస్తున్న పారిశ్రామిక వేత్తలు తమకు ఎదురవుతున్న సమస్యలు, అవసరాలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ సమావేశం అవకాశం కల్పిస్తుందని తెలిపారు. వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసరమైన ప్రభుత్వ అనుమ తులు, వివిధ శాఖల నుంచి అందాల్సిన సహకారం, ఇతర సమ స్యలపై సంబంధిత అధికారులతో నేరుగా చర్చించే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగానికి చెందిన వివిధ



శాఖల అధికారులు సమావేశంలో అందుబాటులో ఉంటారని, సమస్యలను వీలైనంత త్వరగా పరి ష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కృష్ణా జిల్లాలో వ్యాపార అవకాశాలను అన్వేషిస్తున్న ఇతర ప్రాంతాల పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు కూడా సమావేశంలో పాల్గొని జిల్లాలో అందుబాటులో ఉన్న అవకాశాలు, ప్రభుత్వ సహకారం, అనుమతులు తదితర అంశాలపై అధికారులతో చర్చించవచ్చని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్‌కు పారిశ్రామికవేత్తలు, వ్యాపార ఔత్సాహికులు, పెట్టుబడిదారులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. సమావేశానికి సంబంధించిన సమాచారం కోసం 9989092288 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల పాత్ర కీలకం



జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కానుమోలులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ

**బ్యాంకు 1364వ శాఖ ప్రారంభం**

ప్రజాభూమి ప్రతినిధి, కానుమోలు (బాపులపాడు): గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బాపులపాడు మండలం, కానుమోలు గ్రామంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నూతన శాఖను ప్రారంభించారు. ఈ శాఖ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు 1364వ శాఖ కాగా, గుడివాడ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో 50వ శాఖగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీ ణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక సమ్మిళితత్వం ఎంతో అవసరమన్నారు. వాణిజ్య బ్యాంకులు బ్యాంకింగ్ సేవలు అందిం చేందుకు వెనుకాడే మారుమూల ప్రాంతాల్లోకి సైతం ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు వెళ్లి శాఖలను ఏర్పాటు చేసి ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో కానుమోలులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నూతన శాఖ ప్రారంభం కావడం హర్షణీయమన్నారు.కానుమోలు, పరిసర గ్రామా ల్లోని రైతులు, ప్రజలకు ఈ శాఖ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు బ్యాంకులో పొదుపు చేయడంతో పాటు బ్యాంకు అందించే వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయం, చిన్నతరహా వ్యాపారాలు, ఇతర ఆర్థిక కార్యకలాపాలను చేపట్టే వారు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.ఒక ప్రాంతంలోని ప్రజలందరూ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుని, ఆ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే బ్యాంకు సేవల లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు. ప్రజలకు అవసరమైన బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక కార్యకలాపాలకు ఊతమివ్వాలని సూచించారు.నూతన శాఖ ప్రారంభానికి కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కార్యవర్గానికి, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన శాఖ ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తూ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో విజయ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ చైర్మన్ టి అర్జున్ రావు, ఏపీ గ్రామీణ బ్యాంకు చీఫ్ రిస్క్ ఆఫీసర్ ఎం. అరుణ్ కుమార్, జనరల్ మేనేజర్ జె జుమ్మిలాల్ మురలీలాల్, రీజనల్ మేనేజర్ కె ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య గేటెడ్ కమ్యూనిటీలో వినాయక చవితి వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి, గన్నవరం:
గన్నవరం అయోధ్య ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అయోధ్య గేటెడ్ కమ్యూనిటీలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీ వినాయకస్వామి మండపంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అయోధ్య గేటెడ్ కమ్యూనిటీకి చేరుకున్న ఎమ్మె ల్యేకు బాణాసంచా, డప్పు వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం పూర్ణకుం భంతో ఆలయ మండపం వద్దకు ఆహ్వానించిన అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన యార్ల గడ్డ వెంకట్రావు ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అయోధ్య ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయ కులు, భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు. అనంతరం అయో ధ్యలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ మోర్ సూపర్ మార్కెట్‌ను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

**శ్రీ వినాయక మండపంలో స్వామి వారికి ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రత్యేక పూజలు**

**పూర్ణకుంభంతో ఎమ్మెల్యేను మండపం వద్దకు ఆహ్వానించిన అర్చకులు**

**ప్రజలంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని వినాయకస్వామిని ప్రార్థించిన ఎమ్మెల్యే**

**అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ మోర్ సూపర్ మార్కెట్ ప్రారంభించిన ఎమ్మెల్యే**

# మచిలీపట్నం నగర సమస్యలపై ఫోన్ చేస్తే పరిష్కారం: కమిషనర్





మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి
నగర ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మచిలీపట్నం నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. నగర పరిధిలో పారిశుధ్య సమస్యలు, పరిసరాల అపరిశుభ్రత, కాలువల శుభ్రత తదితర సమస్యలను ప్రజలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మీ కోసం" కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం 9849907989 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. ఈ నంబర్‌కు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఫోన్ చేయవచ్చని వెల్లడించారు.అదేవిధంగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని "మీ కోసం" విభాగంలో వినతి పత్రం సమర్పించి కూడా సమస్యలను తెలియజేయవచ్చని అధికారులు సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత సిబ్బందికి పం పించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు నగరంలో పారిశుధ్యం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు ప్రకటనలో పేర్కొన్నారు.

# సాగర తీరంలో ఫాస్ట్‌ఫుడ్ స్టాళ్ల సందడి.. స్థానిక చిరు వ్యాపారులకు నిరాశ

**విజయ గణపతి ఉత్సవాల్లో వివిధ రకాల తినుబండారాలతో**



**సందర్శకులకు కనువిందు.. స్థానిక వ్యాపారులకు దక్కని ప్రాధాన్యం**

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి ప్రతినిధి:
మంగినపూడి సాగరతీరంలో ఏర్పాటు చేసిన 63 అడుగుల విజయ గణపతి ఉత్సవాల్లో వివిధ రకాల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పలు రకాల తినుబండారాలు అందుబాటులో ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.ఉత్సవ ప్రాంగణంలో బజ్జీలు, మంచూరియా, నూడుల్స్, ఫ్రైడ్ రైస్, ఆర్‌సీహెచ్ టిఫిన్ సెంటర్ దోసెలు, పానీపూరీ, బందరు హల్వా, మాడుగుల బెల్లం హల్వా తదితర తినుబండారాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. దీంతో సందర్శకులు తమకు నచ్చిన ఆహార పదార్థాలను ఆస్వాదిస్తూ ఉత్సవాలను సందర్శిస్తున్నారు. వివిధ రకాల తినుబండారాల స్టాళ్లు ఉత్సవ ప్రాంగణా నికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి.స్థానిక చిరు వ్యాపారులకు దక్కని అవకాశంఇదిలా ఉండగా.. మంగినపూడి సాగరతీరంలో నిత్యం చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న స్థానిక వ్యాపారులకు విజయ గణపతి ఉత్సవాల్లో నిరాశే మిగిలిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన ఆహార, ఇతర వ్యాపార స్టాళ్ల కేటాయింపుల్లో తమకు తగిన ప్రాధాన్యం లభించలేదని వారు వాపోతున్నారు.ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్థానిక వ్యాపారులకు అవకాశం కల్పించకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులకు స్టాళ్లు కేటాయించారని పలువురు స్థానిక వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఒక్కో దుకాణానికి రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు అద్దెలు వసూలు చేశారని, ఆ మొత్తా లను చెల్లించే స్థోమత లేక కొందరు స్థానిక వ్యాపారులు వెనుదిరగాల్సి వచ్చిందని చెబుతున్నారు.దీంతో స్థానిక వ్యాపారులు ఉత్సవ ప్రాంగణానికి దూరంగా, చివరి ప్రాంతాల్లో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఏటా సాగరతీరంలో వివిధ కార్యక్రమాలు, ఈవెంట్లు నిర్వహిస్తున్నప్పటికీ స్థానిక చిరు వ్యాపారుల సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికంగా జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు ప్రాధాన్యం కల్పించి, ఉత్సవాల్లో వ్యాపార అవకాశాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

## రాష్ట్ర టి యన్ టి యూ సి ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన ప్రభుత్వ విప్

# బొండా ఉమాకు 64వ డివిజన్ నాయకుల శుభాకాంక్షలు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ
తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ టి యన్ టి యూ సి రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండాఉమామహేశ్వరరావు 64వ డివిజన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.రాష్ట్ర టి యన్ టి యూ సి ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సురవరపు నాగరాజు ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాసనసభలో కార్మికుల హక్కుల కోసం గళం వినిపించే నాయకుడికి ఈ పదవి దక్కడం అభినందనీయమని, ఆయన నాయకత్వంలో టి యన్ టి యూ సి మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపిన బొండా ఉమా కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజేష్, రాజా లింగం, పైడేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక సహకారంతో సిమెంటు రోడ్ల నిర్మాణం

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
కృష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక సహకారంతో గ్రామాలలో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నట్లు చల్లపల్లి జడ్పిటిసి సభ్యురాలు రాజులపాటి కళ్యాణి తెలిపారు.చల్లపల్లి మండల పరిధిలోని పాగోలు పంచాయతీలో గల మేకావారిపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణపు పనులను బుధవారం జడ్పిటిసి సభ్యురాలు కళ్యాణి ప్రారంభించారు. సాంప్రదాయబద్ధంగా సిమెంటు రోడ్డు పనులకు గ్రామస్తులతో కలిసి సర్వమత ప్రార్థనల అనంతరం కళ్యాణి లాంఛనంగా ప్రారంభించారు.జిల్లా పరిషత్ నిధులతో 40 సంవత్సరాలకు పైగా మరమ్మతులకు సైతం నోచుకోని రోడ్లను సిమెంటు రోడ్లుగా నిర్మించడం సంతోషంగా ఉన్నదని ఈ సందర్భంగా కళ్యాణి తెలిపారు. చైర్మన్ ఉప్పాల హారికా రాము సహకారంతో చల్లపల్లి మండలంలోని పలు గ్రామాలలో సిమెంటు రోడ్లను నిర్మించినట్లు వెల్లడించారు.మేకావారిపాలెం గ్రామంలో 124 మీటర్ల మేర ఎనిమిది లక్షల జిల్లా పరిషత్ నిధులతో బుధవారం రెండు సిమెంటు రోడ్లను నిర్మిస్తున్నట్లు గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు కళ్ళేపల్లి రవి అంకినీడు ప్రసాద్ తెలిపారు.40 సంవత్సరాలు పైగా బురదకొయ్యలుగా మారిన తమ గ్రామంలోని రోడ్లను సిమెంటు రోడ్లుగా నిర్మిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక, జడ్పిటిసి సభ్యురాలు రాజులపాటి కళ్యాణి లకు ఈ సందర్భంగా పంచాయతీ మాజీ సర్పంచ్ తోట శ్రీనివాసరావు, గ్రామస్తులు రాజులపాటి సుబ్బారావు, పాస్టర్ అల్లంశెట్టి జయమ్మ, శొంటి సురేంద్ర, రాజులపాటి మల్లేశ్వరి లు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా పరిషత్ నిధులతో మేకావారిపాలెం గ్రామంలో నిర్మించిన సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో తమ గ్రామం చిన్నపాటి పట్టణాన్ని తలపిస్తోందని గ్రామస్తులు చిరునవ్వులు చింది స్తూ, ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల రాష్ట్ర చైర్మన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాజులపాటి శివప్రసాద్, పాస్టర్ అల్లంశెట్టి ఇర్మియా, కాగితపు శ్రీనివాసరావు, రాజులపాటి కృష్ణ మోహనరావు, రాజులపాటి మురళీ, రాజులపాటి బద్రి, కాగితపు జలా చంద్రుడు, వాకా మారుతీరావు, కాగితపు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిరోజూ భారీ అన్నప్రసాదం

## టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి బుద్దా వెంకన్న

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ
విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని మరెక్కడా లేని విధంగా స్థానిక64వ డివిజన్ కండ్రి కలో 8వ సంవత్సర శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గణపతి మహోత్సవములు ఘనంగా నిర్వహిస్తున్నారు.వినాయక చవితి పండుగను పురస్కరించుకుని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి బుద్దా వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొనగా, శ్రీలక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వా హకులు, సభ్యులతో కలసి ఘన నాధునికి పూజలు నిర్వహించారు.శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి చవితి నవరాత్రి ఉత్సవములు శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆర్గనైజర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో ప్రతిరోజుభక్తులకు భారీఅన్న ప్రసాదం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. సుమారు 4వేల నుండి ఐదువేల మంది భక్తులకు అన్నప్రసాదం అందుతున్నదని అన్నారు. స్వామి సేవకుశ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు, అనేకమంది దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారని శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వహికుడు కె. రవికుమార్ తెలిపారు.ఈకార్యక్రమంలోపైడి శ్రీను,ఆర్. కె,బేవర నారాయణ, అల్లు మహేష్, పొలిశెట్టి చంద్ర శేఖర్, పల్లెల రవి, అల్లు నరేంద్ర,తోట సత్యనారాయణ,తోట వెంకట ప్రసాద్,పట్టేం శెట్టి నాగమణి,ఇ. హరికృష్ణ రెడ్డి,జటాధర్ పాల్గొన్నారు.





# వినాయక చవితి సంప్రదాయ బద్ధంగా జరపడం ఆదర్శనీయం

## వెస్ట్ జోన్ ఏ సీ పీ దుర్గారావు



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ
వాతావరణ కాలుష్య రహితంగా, సంప్రదాయ బద్ధంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించడం ఆదర్శనీయమని వెస్ట్ జోన్ ఏ సీ పీ దుర్గారావు అన్నారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సీ వీ ఆర్ ఫ్లై ఓవర్ పక్కన వున్న పోతిన చిన్నా నగర్ లో ఉన్న అస్త్ర అపార్ట్మెంట్ సెల్లారులో జరుగుతున్న వినా యక చవితి పూజల్లో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బుధవారం మధ్యాహ్నం వినాయక నిమజ్జనం సందర్భంగా సెల్లారు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ ని ఏ సీ పీ దుర్గారావు, కొత్తపేట పోలీస్ స్టేషన్ సీ ఐ సీ హెచ్చి కొండలరావు లు ప్రారంభించారు.ఉత్సవ కమిటీ సభ్యులు ఏ సీ పీ ని, సీ ఐ ని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వందలాది మందికి అన్న ప్రసా ద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అస్త్ర అపార్ట్మెంట్ పలువురు దంపతులు చేతులు మీదుగా ప్రత్యేక పూజలు నిర్వాంచారు. అనంతరం భారీయత్తు వూరేగింపుగా గణేష్ నిమజ్జనం జరిగింది.



ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

గురువారం 17 సెప్టెంబరు 2026

## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

విఘ్నేశ్వరుని అనుగ్రహంతో ప్రజల జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోయి, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పల నాయుడు ఆకాంక్షించారు.వినాయక చవితి సందర్భంగా ఏలూరులోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలు,ఆలయాలను బుధవారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సత్రంపాడు వినాయక ఆలయంలో గరికతో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం ఎన్.ఎస్. కూరగాయల మార్కెట్, ఏలూరు అగ్రహారం రామకోటి మైదానం,కుండీ సెంటర్,చెంచుల కాలనీ, సత్రంపాడులో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని నిర్వాహకులను అభినందించారు.ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐకమత్యం మరియు సౌభ్రాతృత్వంతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందేలా గణనాథుడు ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు,కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు,మెగా అభిమానులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.వినాయక చవితి వేడుకలను సంప్రదాయబద్ధంగా, పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా నిర్వహించాలని రెడ్డి అప్పల నాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆళ్ళ నాని మృతి ఏలూరు ప్రజలకు తీరని లోటు

-ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ళ నాని మృతి ఏలూరు నియోజకవర్గ ప్రజలకు తీరని లోటని జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శ్రీరామ్ నగర్‌లోని ఆళ్ళ నాని స్వగృహానికి చేరుకున్న ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.రాజకీయ సిద్ధాంతాలు వేరైనా ఆళ్ళ నానితో తనకు ఆత్మీయ సంబంధం ఉండేదని చంటి గుర్తుచేసుకున్నారు.మృదుస్వభావి, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడిగా కొనియాడారు.గురువారం ఏలూరులో ఆళ్ళ నాని అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరుగుతాయని, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హాజరవుతారని తెలిపారు.

## తోటగూడెంలో వినాయక చవితి సందర్భంగా అన్న సమారాధన.



ప్రజాభూమి ప్రతినిధి–పెదపాడు

వినాయక నవరాత్రుల సందర్భంగా గణనాథుడు గ్రామాలలో భక్తుల చేత ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. ప్రతిరోజు స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ కమిటీ వారు నిర్వహిస్తున్నారు. మండలంలో గల తోటగూడెం గ్రామంలో వినాయక నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి స్వామి వారి విగ్రహం వద్ద బుధవారం ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాలైన పునుకొల్లు, కంద్రిక, రాజుపేట, పాత పెదపాడు, గండు చెరువుగట్టు, వసంతవాడ తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అనంతరం స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. 2000 మందికి పైగా భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఖాకీ చేతులతో వడ్డింపు.. సిబ్బందితో సహపంక్తి.

-పండుగ వేళ.. పోలీస్‌స్టేషన్‌లో ఆత్మీయ విందు.

ప్రజాభూమి బ్యూరో–ఏలూరు జిల్లా.



విధి నిర్వహణలో కఠినంగా కనిపించే పోలీసులు.. పండుగ వేళ ఆత్మీయతను చాటారు. వినాయక చవితి సందర్భంగా ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయక విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.రామ కృష్ణ, ఎస్ఐలు సుధాకర్, నాగబాబు, ఏలూరు రూరల్ ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నా రు.ఈ సందర్భంగా అధికారులు స్వయంగా సిబ్బందికి భోజనాలు వడ్డించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. దీంతో పోలీస్ సిబ్బంది మధ్య సోదరభావం, ఐక్యత మరింత బలపడింది. పండుగ వేళ అధికారులతో కలిసి ఆత్మీయంగా భోజనం చేయడం ఆనందంగా ఉందని సిబ్బంది పేర్కొన్నారు.

## పనికి తగ్గ వేతనం అందించాలని వీఆర్ఏలు చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమంను జయప్రదం చేయండి

### ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ పిలుపు.

ప్రజాభూమి ప్రతినిధి–వేలేరుపాడు.



చాలి చాలని వేతనాలతో దుర్భల జీవితం గడుపుతున్న వీఆర్ఏలకు పనికి తగ్గ వేతనం అందించేందుకు చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమాన్ని కలిసికట్టుగా విజయవంతం చేయాలని వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు రాంబాబు, రమేష్ లు మాట్లాడుతూ,రాష్ట్రంలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) లు సుమారు 20 వేలు మంది గ్రామస్థాయిలో తహశీల్దార్ కార్యాలయాల నందు ప్రభుత్వ విధులు నిర్వర్తిస్తున్నారని,9 సంవత్సరములుగా కేవలం 10500. వేతనంతో దుర్భర జీవితాలను గడుపుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు.వెంటనే సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ మండల నాయకులు పిట్ట రమేష్, రాంబాబు, కోరారు.విఆర్ఏ లు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా జరుగుతున్న ఉద్యమాలను ప్రభుత్వం గుర్తించి, చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాని కోరారు. పేద ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి న్యాయం చేయాలన్నారు.

ఉద్యమం విజయవంతం కావాలనీ న్యాయమైన డిమాండ్లు సాధించాలనీ ఇందుకు రాష్ట్రంలోని వీఆర్ఏలు అందరూ ఐక్యం తో కదిలి ఉద్యమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.



## పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

మండలంలోని అన్నదేవరపేట అరుంధతి పేటకు చెందిన కండేల్లి కార్తీక్, రాచర్ల చంద్ర కాంతం తదితర అర్హులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, కూచిపూడి గణపతి నాయకత్వంలో ఈ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కవల రామాంజనేయులు మాస్టర్, మేక శీను, కె. జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీపై

## భూ పరిపాలన శాఖ ముఖ్య కమిషనర్‌తో జూమ్ కాన్ఫరెన్స్.

ప్రజాభూమి బ్యూరో–ఏలూరు జిల్లా.

ఏలూరు జిల్లాలో సెప్టెంబర్ నెలలో 13 వేల 154 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ లక్ష్యానికి గాను, 13 వేల 124 పుస్తకాలు పంపిణీ చేశామని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి కి చెప్పారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, 22ఏ భూ సమస్యల పరిష్కారం, రీ సర్వే, రెవిన్యూ సమస్యలు, పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయం నుండి బుధవారం రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ జయలక్ష్మి మాటాడుతూ అక్టోబర్ నెలకు గాను పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని, 22ఏ భూ సమస్యలపై అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా నిబంధనల ననుసరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే పనులను నిర్దేశించిన లక్ష్యాల మేర పూర్తిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులపై ధరఖాస్తుదారుని కలిసి సమస్య తెలుసుకుని నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లా నుండి ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ జూమ్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా



అభిషేక్ గౌడ మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో జిల్లాలోని 32 గ్రామాలలో 13 వేల 154 పట్టాదార్ పాస్ పుస్తకాలకుగాను, 13 వేల 124 పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఏలూరు జిల్లాలో జూన్ 15వ తేదీ నుండి సెప్టెంబర్ , 15 వ తేదీ వరకు 22ఏ భూ సమస్యలపై 446 దరఖాస్తులు అందగా వాటిలో 210 దరఖాస్తులు పరిష్కరించామని, నిబంధనల మేరకు లేని 193 దరఖాస్తులను కారణాలు తెలియజేస్తూ తిరస్కరించామన్నారు. పెండింగ్ లో ఉన్న 63 దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో ధరఖాస్తుదారుని కలిసి సమస్య తెలుసుకుని నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, ప్రభృతులు పాల్గొన్నారు.

## సూర్యపేట నీటి సమస్యపై చొరవ.. శాశ్వత పరిష్కారానికి హామీ

ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి



తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సూర్యపేటలో గత పది రోజులుగా తాగునీటి సమస్య నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు టీడీపీ యువనాయకుడు అల్లూరి విక్రమాదిత్య దృష్టికి తీసుకెళ్లారు.దీంతో ఆయన సూర్యపేటలో నెలకొన్న త్రాగు నీటి మరియు పలు సమస్యను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వారం రోజుల్లో శాశ్వత పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు అల్లూరి విక్రమాదిత్య వెల్లడించారు.నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూర్యపేట ప్రజలు కోరుతున్నారు. అనంతరం సూరయ్యపేటలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించారు. ఈ కార్యక్రమంలో పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ముళ్ళపూడి శ్రీరామచంద్ర మూర్తి, తాళ్లపూడి మాజీ ఎంపీటీసీ పెదపాటి కృష్ణ మోహన్, టిడిపి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు స్వీకరణ

### గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు సమావేశం.



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.

ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా (డ్రాఫ్ట్) పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించే ప్రక్రియలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముసాయిదా పోలింగ్ స్టేషన్ల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ఏవైనా అభ్యంతరాలు, మార్పులు లేదా సూచనలు ఉంటే ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా లిఖితపూర్వకంగా సమర్పించాలని ఎంపీడీవో సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామస్వరూప్, డిప్యూటీ ఎంపీడీవో కె. రమేష్ బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్టి వ్యాధి నిర్మూలనకు ఇంటింటా సర్వే ప్రారంభం

- సెప్టెంబర్ 11 నుంచి 24 వరకు అనుమానిత కేసుల గుర్తింపు
- ప్రజల్లో అవగాహన కల్పించిన వైద్య బృందం.






ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.

కుష్టి వ్యాధి నివారణ పక్షోత్సవాల సందర్భంగా ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇంటింటా ఎల్‌సీడీసీ (లెప్రసి కేస్ డిటెక్షన్ కాంపెయిన్) సర్వేను వైద్య సిబ్బంది ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఎల్ఓ కార్యాలయానికి చెందిన డాక్టర్ ఎం. రామానుజారావు, డీఎన్ఎంఓ ఎస్. రుద్రరాజు, ఎంపీహెచ్ఎస్ ఎస్. సూర్యనారాయణ, ఎంపీహెచ్ఎస్, డీఎల్ఏటీఓ బృందం ఇంటింటికీ వెళ్లి కుష్టి వ్యాధి అనుమానితులను పరిశీలించి, వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సర్వే సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. సర్వేలో గుర్తించిన అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ అయిన వారికి ఉచిత చికిత్స అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పి. సౌమ్య, డాక్టర్ హైమశ్రీ, సీహెచ్‌వో అరుణకుమారి, హెచ్‌వీ నిర్మల, వైద్య సిబ్బంది ఎం.టి.వి.ఎన్. మూర్తి, స్వాతి, దివ్యజ్యోతి, ఆశా కార్యకర్తలు రత్నకుమారి, స్వర్ణకుమారి, రేవతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## వివాదరహిత నాయకుడు ఆళ్ల నానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నివాళి

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు



మాజీ ఉప ముఖ్యమంత్రి, వివాదరహిత నాయకుడు ఆళ్ల నాని అకాల మరణం ఏలూరు ప్రజలకు తీరని లోటని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న ఎంపీ, ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి అశ్రునివాళులర్పించారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ... ఏలూరు నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా,డిప్యూటీ సీఎంగా మరియు వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఆళ్ల నాని అందించిన సేవలను కొనియాడారు.నాని తనతో ఎంతో స్నేహపూర్వకంగా ఉండేవారని, ఇటీవల కూడా స్థానిక అంశాలపై చర్చించామని గుర్తుచేసుకున్నారు.ఆయన హఠాన్మరణం వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని, నాని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కష్ట సమయంలో భగవంతుడు ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు: టీడీపీ నేతలు





ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి, రావులపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్ పేర్కొన్నారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా పారిశ్రామిక అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, డీఎస్సీతో పాటు వివిధ శాఖల్లో నియామకాలకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వారు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడు తూ, రైతులు, మహిళలు, యువతకు సమాన అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా లైక్ లు, వ్యూస్, ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్‌లతోనే రాజకీయం నడవదని, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారానే నిజమైన నాయకత్వం ఏర్పడుతుందని యువతకు సూచించారు. ప్రజల బాధలను అర్థం చేసుకుని పరిష్కారం కోసం పనిచేసే నాయకత్వమే అవసరమని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేయడం, వాస్తవాలకు విరుద్ధమైన సమాచారాన్ని వ్యాప్తి చేయడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులకు సూచించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధమైన పాలన కొనసాగుతోందని, యువతపై నిర్బంధం జరుగుతోందంటూ చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీల కార్యక్రమాలకు ఆటంకాలు కల్పించడం, ఉద్యోగ సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లపై నిర్బంధ చర్యలు చోటుచేసుకున్నాయని వారు ఆరోపించారు. గతంలో జరిగిన ఘటనలను ప్రస్తుత ప్రభుత్వానికి ఆపాదిస్తూ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను టీడీపీ కార్యకర్తలు ప్రజల్లో ఎండగట్టాలని వారు పిలుపునిచ్చారు.

ప్రజాభూమి



# అధికారులు అంచనాలతో అంత్యక్రియలకు సన్నాహాలు.

- శోక సంద్రంలో ఏలూరు ప్రజలు.
- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న అభిమానులు.

**ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా.**
ఆళ్ల నాని - ఏలూరు రాజకీయాల్లో చెరగని ముద్ర ఎమ్మెల్యే నుంచి ఉప ముఖ్యమంత్రి వరకు సాగిన రాజకీయ ప్రస్థానంఏలూరు రాజకీయాల్లో ఒక సౌమ్యమైన, స్నేహశీలి నాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ మంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) ఇక లేరు. 2026 సెప్టెంబర్ 15న విశాఖపట్నంలో గుండెపోటుతో ఆయన ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన వయసు 56/57 సంవత్సరాలుగా వివిధ తాజా నివేదికల్లో పేర్కొనబడింది .ఏలూరు రాజకీయాల్లో దాదాపు మూడు దశాబ్దాల ప్రస్థానాన్ని కొనసాగించిన ఆళ్ల నాని, సాధారణ రాజకీయ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. ఆయన రాజకీయ జీవితంలో పార్టీ మార్పులు, ఎన్నికల విజయాలు-పరాజయాలు, మంత్రి పదవి, ప్రతిపక్ష రాజకీయాలు ఇలా అనేక మలుపులు కనిపిస్తాయి.

**కాంగ్రెస్‌తో రాజకీయ అరంగేట్రం**
ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ 1969 డిసెంబర్ 30న ఏలూరులో జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన 1994, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. అయితే పరాజయాలతో వెనకడుగు వేయకుండా ప్రజల్లో తన రాజకీయ సంబంధాలను కొనసాగించారు. ఆ కృషికి ఫలితంగా 2004లో తొలిసారి ఏలూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. టీడీపీ అభ్యర్థి అంబికా కృష్ణపై గెలుపొందారు. 2009లోనూ కాంగ్రెస్ తరఫున ఏలూరు నుంచి విజయం సాధించి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగారు.

**వైఎస్సార్ కాంగ్రెస్‌లోకి మలుపు**
2013లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆయన రాజకీయ జీవితంలో కీలక మలుపు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఏలూరు నుంచి పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. అనంతరం 2017లో ఎమ్మెల్యేల కోటాలో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికై రాజకీయంగా తిరిగి బలపడ్డారు.

**2019లో మళ్లీ ఏలూరు ఎమ్మెల్యేగా...**
2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఏలూరు నియోజకవర్గం నుంచి తిరిగి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆళ్ల నానికి కీలక బాధ్యతలు లభించాయి. ఆయన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా, ఆరోగ్య-కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్య శాఖల మంత్రిగా 2019 నుంచి 2022 వరకు పనిచేశారు.

**కోవిడ్ సమయంలో ఆరోగ్యశాఖ మంత్రిగా...**
ఆళ్ల నాని రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైన దశల్లో ఒకటి ఆయన ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న కాలం. 2019లో మంత్రి బాధ్యతలు చేపట్టిన కొద్దికాలానికే ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి విజృంభించింది. ఆ సమయంలో రాష్ట్ర ఆరోగ్యశాఖకు సంబంధించిన అనేక సవాళ్లను ఎదుర్కొంటూ



ఆయన శాఖాపరమైన బాధ్యతలు నిర్వహించారు. ఆ కాలం ఆయన ప్రజా జీవితంలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలిచిపోయింది. రాజకీయాల్లో స్నేహశీలి వ్యక్తిత్వంఆళ్ల నాని గురించి రాజకీయ వర్గాల్లో తరచుగా ప్రస్తావించబడే అంశాల్లో ఆయన సౌమ్య స్వభావం, అందరితో కలిసిమెలిసి ఉండే తీరు ముఖ్యమైనవి. రాజకీయంగా భిన్న పార్టీలకు చెందిన నాయకులతోనూ, ప్రజా ప్రతినిధులతోనూ సంబంధాలను కొనసాగించడం ఆయన వ్యక్తిత్వంలో ఒక ప్రత్యేకతగా ఆయనను పరిచయం చేసిన పలువురు గుర్తుచేసుకుంటున్నారు. ప్రత్యేకంగా ఏలూరు నియోజకవర్గ ప్రజలతో ఆయనకు ఉన్న సుదీర్ఘ అనుబంధం ఆయన రాజకీయ జీవితానికి ప్రధాన బలం. 2024 తర్వాత మరో రాజకీయ మలుపు2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి అనంతరం ఆళ్ల నాని ఆ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం 2025 ఫిబ్రవరి 13న తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇలా కాంగ్రెస్ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్, ఆ తరువాత తెలుగుదేశం వరకు ఆయన రాజకీయ ప్రయాణం సాగింది. 2026లో విషాదాంతంరాజకీయాల్లో దాదాపు మూడు దశాబ్దాల అనుభవం ఉన్న ఆళ్ల నాని ఆకస్మిక మరణం ఏలూరు రాజకీయ వర్గాల్లో విషాదాన్ని నింపింది. ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తదితరులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేసినట్లు తాజా నివేదికలు పేర్కొన్నాయి. ఒక రాజకీయ అధ్యాయం ముగిసింది కాంగ్రెస్ కార్యకర్తగా ప్రారంభమైన ప్రయాణం... ఏలూరు ఎమ్మెల్యేగా ఎదుగుదల... వైఎస్సార్ కాంగ్రెస్‌లో కీలక నాయకుడిగా ఎదగడం... శాసనమండలి సభ్యత్వం... 2019లో మళ్లీ ఎమ్మెల్యేగా విజయం... ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు... చివరికి తెలుగుదేశం పార్టీలో చేరిక... ఇలా ఎన్నో మలుపులతో సాగిన ఆళ్ల నాని రాజకీయ జీవితం 56/57 ఏళ్ల వయసులోనే ఆకస్మికంగా ముగిసింది. పదవులు శాశ్వతం కావు... రాజకీయ పార్టీలు మారుతుంటాయి... కానీ ప్రజలతో ఏర్పడిన అనుబంధం, రాజకీయ జీవితంలో మనిషిగా మిగిల్చిన జ్ఞాపకాలు మాత్రం నిలిచిపోతాయి. ఏలూరు రాజకీయ చరిత్రలో ఆళ్ల నాని పేరు ఒక ముఖ్యమైన అధ్యాయంగా మిగిలిపోతుంది. ఆళ్ల నాని గారికి ఘన నివాళి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి.

# కొత్తపేటలో వైఎస్సార్సీపీ విస్తృత స్థాయి సమావేశం

ముఖ్య నాయకులకు ఐడెంటిటీ కార్డుల పంపిణీ.. పార్టీ బలోపేతంపై చిర్ల జగ్గిరెడ్డి దిశానిర్దేశం.



**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.**
నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకుడు పాటి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయిల్లో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు, మండల పార్టీ బాధ్యులకు ఐడెంటిటీ కార్డులను అందజేశారు. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలకు తగిన బాధ్యతలు అప్పగిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించి, ప్రస్తుత పాలనలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ప్రతి గడపకు తీసుకెళ్లేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని నాయకత్వం సూచించింది. రానున్న రోజుల్లో కొత్తపేట నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను మరింత ఉధృతం చేసి ప్రజా సమస్యలపై ఉద్యమాలను కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# రాజా బహదూర్ సేవలు చిరస్మరణీయం

**బహదూర్ విగ్రహ నిర్మాణం కోసం మంత్రి సుభాష్ శంకుస్థాపన.**

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.**
రామచంద్రపురం మాజీ ఎమ్మెల్యే, దానకర్ణుడిగా పేరుగాంచిన రాజా కాకర్లపూడి రామచంద్ర రాజా బహదూర్ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం రామచంద్రపురం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న రాజా బహదూర్ విగ్రహ నిర్మాణానికి మంత్రి సుభాష్ శంకుస్థాపన చేశారు. రామచంద్రపురం అభివృద్ధికి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనకు, నిరుపేదల సంక్షేమానికి రాజా బహదూర్ చేసిన సేవలను గుర్తిస్తూ ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కుల, మత భేదాలకు అతీతంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, నిరుపేదల అవసరాల కోసం సుమారు 30 ఎకరాలకు పైగా భూమిని దానం చేసిన మహాదాతగా రాజా బహదూర్ నిలిచారని మంత్రి కొనియాడారు. ప్రజల విద్యాభివృద్ధి కోసం సుమారు 22 పాఠశాలలను నిర్మించి, వాటికి జాతీయ నాయకుల పేర్లు పెట్టడం ఆయన దేశభక్తికి, సేవా భావానికి నిదర్శనమని అన్నారు. రామచంద్రపురం ప్రాంత అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి రాజా బహదూర్ చేసిన కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. ఆయన సేవలను



స్మరించుకోవడంతో పాటు, యువతకు మరియు ప్రజలకు ఆయన ఆదర్శాలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాజా బహదూర్ విగ్రహాన్ని స్థానిక కూటమి నాయకులు చందమామ వాసు ఏర్పాటు చేయనున్నారు. విగ్రహ ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతను ఈసందర్భంగా మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు, మున్సిపల్ డీఈ శ్రీకాంత్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజ గోపాల నరసరాజు, మాగాపు అమ్మిరాజు, అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ రావులపాలెం డిపోలో అవుట్‌సోర్సింగ్ డ్రైవర్ల నియామకం

-21వ తేదీలోగా దరఖాస్తులు ఆహ్వానం - మెడికల్, శిక్షణ అనంతరం ఎంపిక.

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) రావులపాలెం డిపోలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన డ్రైవర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు సెప్టెంబర్ 21లోగా రావులపాలెం డిపో మేనేజర్ కార్యాలయంలో ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు, ఆ లైసెన్స్‌కు కనీసం 18 నెలల సీనియారిటీ ఉండాలి. సంబంధిత ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్టిఓ ) కార్యాల యం నుంచి జెన్యూన్ సర్టిఫికెట్ పొందిన వారు మాత్రమే అర్హులు. కనీస విద్యార్హతగా 8వ తరగతి ఉత్తీర్ణత ఉండాలని అధికారులు వెల్లడించారు. తప్పనిసరిగా తీసుకురావాల్సిన పత్రాలు (ఆధార్ కార్డు, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ (ఒరిజినల్), ఆర్టిఓ జెన్యూన్ సర్టిఫికెట్, 8వ తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రం). ఎంపికైన అభ్యర్థులను మెడికల్ పరీక్షలు, శిక్షణ పూర్తైన అనంతరం విధు ల్లోకి తీసుకుంటామని డిపో మేనేజర్ తెలిపారు. ఉద్యోగావకాశాన్ని వినియోగించుకోవాలని అర్హులైన అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు.

# మోదీ 25 ఏళ్ల సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు.



**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**
సెప్టెంబర్ 17 న ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని మోదీ 25 ఏళ్లు సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు నెల రోజుల పాటు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సేవా సంకల్ప అభియాన్ కన్వీనర్ నాగిరెడ్డి సతీష్ రావు తెలియజేశారు. ఈ సందర్భంగా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మండల బిజెపి అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ మండల బిజెపి ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి, తదితరులు మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం పలు సేవా కార్యక్రమాలలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో భాగంగా నిర్వహించే మోదీ "ఆశీర్వాద దీపం" కార్యక్రమంలో ప్రతి కుటుంబ సభ్యులు పాల్గొని దేశ సేవకు అంకితమైన ప్రధాని మోదీకి మన ఆశీస్సులు, శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఇంటా,గుడి వద్ద, చారిత్రాత్మక ప్రదేశాల వద్ద దీపాలు వెలిగించాలని కోరారు. దేశ సేవకు అంకితమైన నాయకత్వానికి దీపం వెలిగించడం ద్వారా కోట్ల ఆశీర్వాదంతో పాటుగా శుభాకాంక్షలు అందజేయాలని సతీష్ రావు కోరారు ఈ సేవా కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని ఆకేటి శ్రీకృష్ణ కోరారు

# రామచంద్రపురం
# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా హిందీ భాషా దినోత్సవం

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**
హిందీ దినోత్సవం పురస్కరించుకొని రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ . శ్రీనివాస్ అధ్యక్షతన కార్యాక్రమం నిర్వహించారు హిందీ భాష నేర్చుకోవడం ద్వారా అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావడమే కాకుండా, భారతదేశంలో ఎక్కడికైనా వెళ్లడానికి ఎటువంటి ఇబ్బంది భాషను నేర్చుకోవడం ద్వారా ఉండదని ,విద్యార్థులు హిందీ భాషని తప్పకుండా నేర్చుకోవాలని ,రాష్ట్ర భాషతో పాటు జాతీయ భాష మీద కూడా మంచి ప్రావీణ్యత ఉండాలని తెలియజేశారు. కళాశాలలో ద్వితీయ భాషగా హిందీ కూడా ఉండడం విద్యార్థులకు మంచి అవకాశం అని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హిందీ అధ్యాపకులు ఆర్ .



వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హిందీ భాషలో అత్యంత విలువైన సాహిత్య విషయాలు ఉన్నాయని, భారతదేశం అంతా కూడా ఏకతాటి మీద నడవడానికి హిందీ భాష ఎంతో సహకరించిందని, ప్రపంచ స్థాయికి దీటుగా దేశాన్ని నిలబెట్టడంలో భాష ప్రముఖస్థానం వహిస్తుందని తెలియజేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన విశ్రాంత అధ్యాపకులు సయ్యద్ ఆదా హుస్సేన్ విద్యార్థులను ఉద్దేశించి హిందీ భాషని ఒకరితో ఒకరు మాట్లాడటం ద్వారా చాలా సులువుగా నేర్చుకోవచ్చని ,హిందీ అనేది మన దేశ భాషను, హిందూ అనేది మన దేశ చరిత్రను తెలియజేసేదని ,సంస్కృతి సాంప్రదాయాలకు నేలువుగ భాష ఉంటుందన్నారు. వాణిజ్య ,వ్యాపార రంగాల్లో హిందీ భాష మనదేశంలోనే ప్రథమంగా నిలిచిందని ప్రపంచ భాషల్లో రెండవ స్థానంలో హిందీ భాష ఉందన్న విషయాన్ని విద్యార్థులకు తెలియజేశారు. హిందీ విభాగాధిపతి డాక్టర్ ఎన్వి రమణ విద్యార్థులకు హిందీ భాషా దినోత్సవ కార్యక్రమ విశిష్టతను తెలియజేశారు.

# జి.వి.ఎస్.వి.ఆర్.ఎం స్కూల్‌లో ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



పాలకొల్లు పట్టణ పరిధిలో గల జి.వి.ఎస్.వి. ఆర్.ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ నందు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరంసెప్టెంబర్ 16వ తేదీని ప్రతి సంవత్సరం అంతర్జా తీయ ఓజోన్ పొర పరిరక్షణ దినంగా జరుపుకుంటామని, 1987లో మాంట్రియల్ ఒప్పందం కుదిరిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఓజోన్ పొర సూర్యుని నుండి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి భూమిపై ఉన్న జీవరాశిని కాపాడుతుందని, సీఫ్సీ వాయువులు, కాలుష్యం వల్ల ఓజోన్ పొరకు రంధ్రం పడుతుందని విద్యార్థులకు వివరించారు. పర్యావరణహిత వస్తువులను వాడాలని, చెట్లను నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు "ఓజోన్ పొరను కాపాడుదాం - భవిష్యత్తును రక్షిద్దాం" అనే నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు పెట్టి పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రధానోపాధ్యాయుల వారి సౌజన్యంతో కలర్ పెన్సిల్ కిట్స్ , స్కేల్స్ పంచడమైనది. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి నందిని పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యాలతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి


**రాష్ట్ర కార్మిక శాఖమంత్రి సుభాష్**

**ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు.**
మహిళల ఆర్థిక సాధికారతకు స్వయం ఉపాధి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో జనసేన వీరమహిళ సలాది పుష్పవతి ఆధ్వర్యంలో నిర్వహించిన అగరబత్తుల తయారీ స్వయం ఉపాధి శిక్షణ తరగతులను ఆయన సందర్శించి మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ మహిళలు కుటుంబ ఆదాయాన్ని పెంచుకునేందుకు వృత్తి నైపుణ్య శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అగరబత్తుల తయారీ వంటి కుటీర పరిశ్రమల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడంతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని



ఆకాంక్షించారు. శిక్షణతో పాటు మార్కెటింగ్, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల అనుసంధానంలో కూడా అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలు అందిస్తున్న ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు, బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు వచ్చి ఆర్థికంగా బలపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ చవ్వాకుల నారాయణమూర్తి,జయ యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ జయ సత్యవేణి, యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు, డీఆర్డీఏ అధికారులు, శిక్షకులు శంకర్, చైతన్య, ఏఎంసి వైస్ చైర్మన్ దడాల నాగేశ్వరి ,దడాల నాగార్జున, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చుండ్రు వీర్రాజు చౌదరి, తాడి మాచారెడ్డి( రామారెడ్డి) అంగర కృష్ణ, కోట తాతబ్బాయి, తోట కృష్ణ, నక్క శ్రీను, పలివెల రాజు, లకాని కృష్ణ చైతన్య, బోండా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ ఆర్ సమస్యలపై పోలవరం ప్రాజెక్టు కమిషనర్ కు వినతిపత్రం



**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**
మండలంలోని పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులవుతున్న బాధితుల ఆర్ అండ్ ఆర్ సమస్యలపై, టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్, నిర్వాసిత ప్రజలు బుధవారం పోలవరం ప్రాజెక్టు కమిషనర్ కు సమస్యలతో కూడిన వినతిపత్రం ను అందించారు. 2022 ఆర్ అండ్ ఆర్ కట్ ఆఫ్ డేట్ మీద యువతి యువకులు తీవ్రంగా నష్టపోతున్నారనీ, కావున వారికి న్యాయం చేయగలరని కోరారు. అండ్ ఆర్ పిడిఎఫ్ లో ఉండి మరణించిన వారికి వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వచ్చు విధముగా చర్యలు తీసుకోవాలనీ అన్నారు. అలాగే మండలంలోని బీసీ కాలనీ, రామవరంపాడు గ్రామాల్లో ఉన్నటువంటి ఇండ్లకు నష్టపరిహారం ఇవ్వాలని, జల్లివారి గూడెం గ్రామంలో ఉన్న వ్యవసాయ భూమి 41.15 కాన్పూర్లో చేర్చి, అట్టి భూమికి నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని మిగిలి ఉన్న ఇంటి విలువలు, ఆర్ అండ్ ఆర్ త్వరగా చెల్లించవలసిందిగా అధికారులను కోరారు.

## జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉమ్మడిగా కృషి చేయాలి..

- కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో సజావుగా అమలు చేయాలి: పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ
- జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉమ్మడిగా కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో సక్రమంగా, మరింత బాగా అమలు చేయాలని పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణ లోని డిపిఆర్సీ సమావేశ మందిరంలో దిశా (జిల్లా అభివృద్ధి సమన్వయ ు పర్యవేక్షణ కమిటీ) సమావేశాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించగా, జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, ఆయా శాఖల జిల్లా అధికారులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు మరియు జిల్లా అధికారులు కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. జిల్లాలోని ప్రధాన సమస్యలను గుర్తించి, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అధికారుల బాధ్యతను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా జిల్లాను 'సస్యశ్యామలం' చేయడమే ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి దిశా సమావేశం ఏర్పాటు చేయనున్నామన్నారు. దాదాపు 108 కేంద్ర ప్రయోజిత పథకాలు అమలులో ఉన్నాయని, జిల్లా ప్రయోజనాల కోసం నిధుల విడుదలకు కేంద్ర స్థాయిలో బలంగా స్వరం వినిపిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి గారిని నేరుగా కోరిన మీదట 'జలజీవన్ మిషన్' ద్వారా జిల్లాకు అవసరమైన నిధుల మంజూరు ప్రక్రియ వేగవంతమైందన్నారు. రాయలసీమ వెనుకబడిన జిల్లాల అభివృద్ధి ఫండ్ కింద గతంలో నిలిచిపోయిన నిధులను, పార్లమెంట్ లో ప్రశ్నించడం ద్వారా తిరిగి ప్రతి సంవత్సరం ?50 కోట్లు చొప్పున జిల్లా అభివృద్ధికి వచ్చేలా కృషి చేయడం జరిగిందన్నారు. నిధుల వినియోగం, పథకాల పురోగతిపై అధికారులు సరైన వివరాలు మరియు సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరిన్ని నిధులు తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఐక్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఎంపీ నిధులకు సంబంధించి 12.54 కోట్ల రూపాయలు 154 పనులకు మంజూరు కాగా, అందులో 6.31 కోట్ల రూపాయలకు సంబంధించి పనులను గుర్తించాలన్నారు. ఎంపీ నిధుల కింద ఎక్కువ నిధులు జిల్లాకు తీసుకురావడం జరిగిందని, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు చేపట్టాలన్నారు. జిజిహెచ్ లో విశ్రాంతి భవనంలో అవసరమైన సదుపాయాలు కల్పించి దానిని త్వరగా ప్రారంభించాలన్నారు. ప్రజలకు అవసరమైన అత్యానర పనులను వేగంగా చేపట్టాలని, త్రాగునీటికీ అవసరమైన నిధులు కేటాయిస్తామని, ఎక్కడైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనులను తొందరగా చేయించాలని, 136 కోట్ల రూపాయలు ఇప్పటివరకు ఖర్చు చేయగా, ఆన్లైన్లో మాత్రం 7.68 కోట్లు ఖర్చు చేసినట్లు వస్తోందని, పూర్తయిన పనులకు బిల్లులు అప్లోడ్ పెండింగ్ ఉంచరాదన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగునీరు అందించాలన్నారు. అనంతపురం నగరంలోని ట్రెల్లిస్ స్కూల్ ఘటనలో చిన్నారి తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని చెబుతున్నారని, ట్రెల్లిస్ పాఠశాల లైసెన్స్ ని రద్దు చేయించాలని, త్రీ మెన్ కమిటీ నివేదిక వచ్చాక తగిన చర్యలు తీసుకోవాలని డిఈఓని ఆదేశించారు. ఓఎన్జిసి వారు ఐదువేల యూనిఫార్మ్స్ ఇవ్వడం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టల్స్ లలో యూనిఫాం అందించేందుకు విద్యార్థులను గుర్తించాలన్నారు. మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయిలో డీఈవో పర్యటించాలని, స్పెషల్ డ్రైవ్ చేయాలని, సోమవారం నుంచి శుక్రవారం వరకు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. ఆయా పాఠశాలల్లో అవసరమైతే ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుకు ఎంపీ నిధులను కేటాయిస్తామన్నారు. పాఠశాలల్లో బాలికలకు సమాజంలో పరిస్థితి ఎలా ఉంది, భవిష్యత్తుపై భయాలు తొలగించేలా, వారిలో ధైర్యం నింపేలా మోటివేట్ చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి పెన్షన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత ఎల్.నినో పరిస్థితులలో వరి, మిరప సాగు చేయొద్దని రైతులకు తెలియజేశామని అధికారులు తెలపగా, వచ్చే జూన్ వరకు వర్షాలు వచ్చే పరిస్థితి లేదని, మొదట త్రాగునీటికి, తర్వాత పశుగ్రాసం సాగు కోసం నీటిని అందించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్.నినో వేళ ఉద్యాన



మొక్కలను సంరక్షించుకోవాలని, నీటి సమస్య వల్ల మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని, వాటికి నీరు ఇచ్చేలా చూడాలన్నారు. జాతీయ రహదారి కింద రుద్రంపేట జంక్షన్ లో వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఇబ్బంది పడడం జరుగుతుందని, అక్కడ రహదారిని విస్తరించాలన్నారు. కల్లూరు ఆర్ఓబిలో ఎప్పుడు నీరు నిల్వ ఉంటుందని, రైల్వే బ్రిడ్జి కిందకు నీరు వెళ్లకుండా డైవర్ట్ చేయాలన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రోటోకాల్ పాటించాలన్నారు. ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రస్తుత ఎల్.నినో పరిస్థితుల్లో త్రాగునీటికి నిధులను కేటాయించాలని, కమ్యూనిటీ భవనాలకు కూడా ఎంపీ నిధులను కేటాయించాలన్నారు. జిల్లా పరిషత్ నుంచి త్రాగునీటికి నిధులు కేటాయిస్తున్నామని, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపాలిటీల నుంచి యూజర్ చార్జెస్ రావడం లేదని, అవి వచ్చేలా చూడాలన్నారు. పాఠశాలలు, గురుకులాల్లో చిన్నారులకు భద్రత కరువైందని, బాలికలను ఇబ్బంది పెడుతున్న వారికి కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లల ఆరోగ్యం, భద్రత, రక్షణ చాలా ముఖ్యమైనదని, ట్రెల్లిస్ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కంబదూరు, నార్పల, తదితర ప్రాంతాల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అమలు చేయడం లేదని, డిఈఓ క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ప్రస్తుతం టీనేజీ ప్రెగ్నెన్సీలు ఎక్కువ అవుతున్నాయని, వాటిని అరికట్టాలన్నారు. కొన్ని పాఠశాలల్లో పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయని, వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. పెన్షన్స్ కోసం దరఖాస్తు చేయడానికి సచివాలయానికి వెళ్తే అక్కడ సిస్టమ్స్ పనిచేయడం లేదని, వాటిని సరిచేయాలన్నారు. మహిళలకు బ్యాంకు లింకేజీ, రుణాల మంజూరులో సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా పరిషత్ కి 16వ ఫైనాన్స్ నిధులు రావడం లేదని, వచ్చేలా చూడాలన్నారు. ఎల్.నినో పరిస్థితులతో నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన రైతులకు సహాయం చేయాలన్నారు. ఎల్.నినో పరిస్థితిలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ దిశా సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఆయా నియోజకవర్గాల్లో పూర్తయిన పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్.నినో పరిస్థితుల నేపథ్యంలో ఉద్యాన పంటల మొక్కలను బతికించాలని ఇందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏపీఎమ్ఐపి నుంచి నాన్ సబ్సిడీ కనెక్షన్స్ లక్ష్యం మేరకు చేపట్టాలన్నారు. మహాప్రస్థానం వాహనం కోసం డ్రైవర్ నియామకానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఆయా పాఠశాలల్లో అవసరమైన చోట అదనంగా గదులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. అందరు హెచ్వోడీలు స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు చేపట్టాలని, ఇందులో క్షేత్రస్థాయిలో సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ బాలాజీ నాయక్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, డిపిఓ నాగరాజునాయుడు, డ్వామా పిడి సలీమ్ భాష, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్బరాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, పశుసంవర్థక శాఖ జెడి ప్రేమ్ చంద్, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, హౌసింగ్ పిడి శైలజ, డిఆర్డీఏ పిడి శైలజ, మైన్స్ డిడి ఆదినారాయణ, నాబార్డు ఏజిఎం అనురాధ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఎస్సి కార్పొరేషన్ ఈడి కుముద, డిఎంహెచ్ఓ కట్ట వెంకటేశ్వర్లు, డిఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, డిటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి అర్చన, డిఈఓ అయూబ్ హుస్సేన్, ఆర్ఐఓ వెంకటరమణనాయక్, రెడ్స్ సంస్థ భానుజా, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, డి.ఎస్.ఓ శోభారాణి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.మల్లీశ్వరి, కమిటీ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని వినాయకుడికి పూజలు

ప్రజా భూమి నార్పల



మండల కేంద్రంలోని దిగుమరి రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సంతోషంగా ఉండాలని, మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వినాయకుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, పక్కిరెడ్డి, నారాయణరెడ్డి, భయపరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పట్నం పనీంద్ర, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్, నాయకులు వేదాంత మోహన్, భాస్కర్‌రెడ్డి, భయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సరైన పోషణతోనే ఆరోగ్యవంతమైన సమాజం

### -ఘనంగా అంగన్వాడి కేంద్రంలో పోషణ మహోత్సవం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



చిన్నారులు సరైన పోషక పదార్థాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందని సిడిపిఓ సుధా వరలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని హస్నాబాద్ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన పిల్లలే సమాజానికి పునాది అన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం ఎంతో కీలకమని, ప్రతి తల్లిదండ్రులు పిల్లలకు సమతుల్యమైన ఆహారం అందించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే బాలామృతం, పాలు, గుడ్లు ప్రతిరోజు పిల్లలకు అందేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసు గల పిల్లలను క్రమం తప్పకుండా అంగనవాడికేంద్రాలకు పంపించాలని, అక్కడ అందించే మధ్యాహ్న భోజనం పాలు, గుడ్లు వంటి పౌష్టికాహారాన్ని పిల్లలు సక్రమంగా తీసుకునేలా చూడాలన్నారు. పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదగడానికి తల్లిదండ్రులు, అంగన్వాడీ కార్యకర్తలు, సమాజంలోప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నేటి సరైన పోషణ రేపటి ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శాంతి, అంగన్వాడి కార్యకర్తలు శైలజ, లక్ష్మీ, నరసమ్మ, సునీత, సుజాత, మస్తాన్ బీ, షాహిదా, అంగన్వాడి విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

### -జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలపరిధిలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో భాగంగా పెండింగ్ లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తో కలిసి వివిధ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పనితీరుపై సంబంధిత విశ్వవిద్యాలయ ప్రతినిధులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూనివర్సిటీలో ఇదివరకే చేపట్టిన పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ముఖ్యంగా జంతులూరు నుండి కొర్రపాడువైపు ఉన్న యూనివర్సిటీ ప్రహరీ గోడ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. అలాగే యూనివర్సిటీలోని పాత బోర్లనుమినహాయించి నూతనంగా జంతలూరు లో ప్రజల నూతనంగా 3 నీటి బోర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాంపౌండ్ వాల్, మట్టిరోడ్డుపనులమంజూరు కు సంబంధించి ప్రతిపాద నలు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు .యూనివర్సిటీ భూమి వివరాలను సమర్పించాలని బుక్కరాయసముద్రం తాసిల్దార్ కు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ కివాడే, ప్రొ. హనుమాన్ కెనడి, బుక్కరాయసముద్రం తాసిల్దార్ శ్రీధర్ మూర్తి, పంచాయతీరాజ్ ఎస్. ఈ. సుబ్బరాయుడు,ఆర్డబ్ల్యూ ఎస్ .ఎస్. ఈ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల రెన్యువల్‌కు 21 వరకు గడువు

### --లైసెన్స్ ఫీజుపై 38 శాతం పెంపు
### --రెన్యువల్ చేసుకోని దుకాణాలకు 22 నుంచి టెండర్లు
### --జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌కేడీవీ ప్రసాద్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

2026--27 సంవత్సరానికి మద్యం దుకాణాల లైసెన్సుల రెన్యువల్ ప్రక్రియకు ఈ నెల 21వ తేదీ వరకు గడువు ఉందని ఉమ్మడి అనంతపురం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌కేడీవీ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న లైసెన్స్ ఫీజుపై 38 శాతం పెంచి రెన్యువల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా లైసెన్స్‌దారులు తమ మద్యం దుకాణాలను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. బుధవారం హిందూపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దుకాణాల లైసెన్స్‌దారులు, యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడువులోగా రెన్యువల్ చేసుకోని మద్యం దుకాణాలకు ఈ నెల 22వ తేదీ నుంచి నోటిఫికేషన్ జారీ చేసి టెండర్లు నిర్వహిస్తామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. టెండర్ ప్రక్రియ ద్వారా మిగిలిన మద్యం దుకాణాలను కేటాయించడంతోపాటు, అవసరమైన చోట ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. లైసెన్స్‌దారులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా సకాలంలో రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా ఎక్సైజ్ అధికారి బి.నరసింహులు, హిందూపురం ఎక్సైజ్ సీఐ ఎన్.లక్ష్మి దుర్గయ్య, ఎక్సైజ్ సిబ్బంది, మద్యం దుకాణాల లైసెన్స్‌దారులు, యజమానులు పాల్గొన్నారు.



## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76 వ జన్మదిన సందర్భంగా

## సేవా సంకల్ప అభియాన్‌లో 108 కొబ్బరికాయలతో నల్లమ్మ గుడిలో ప్రత్యేక పూజలు

ప్రజా భూమి శింగనమల,

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని, బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న"సేవా సంకల్ప అభియాన్"లో భాగంగా శింగనమల ఎస్సీ కాలనీలోని శ్రీశ్రీశ్రీ నల్లలమ్మ అమ్మవారి దేవాలయంలో 108 కొబ్బరి కాయలతో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పి. రామాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. కార్యక్రమంలో భాగంగా తొలుత శింగనమలలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 108 కొబ్బరికాయలను తీసుకుని డప్పు వాయిద్యాల నడుమ పాదయాత్రగా శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ




ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు సమర్పించారు. అనంతరం శింగనమల ఎస్సీ కాలనీలోని గ్రామదేవత ఆలయంలో పూజలు నిర్వహించి, అక్కడి నుంచి శ్రీశ్రీశ్రీ నల్లలమ్మ అమ్మవారి దేవాలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా కొబ్బరికాయలను నెత్తిన పెట్టుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని చేతపట్టి భక్తిశ్రద్ధలతో పాదయాత్ర నిర్వహించారు. శ్రీ నల్లలమ్మ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి చీర, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించారు. అనంతరం 108 కొబ్బరికాయలను కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి సంపూర్ణ ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని, దేశ సేవలో మరింత శక్తి, సామర్థ్యంతో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు నిర్వాహకులు తెలిపారు. దేశ సమగ్ర అభివృద్ధి, భారతావని వైభవం, ప్రజాసేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల సేవా సంకల్పాన్ని స్మరించుకుంటూ నిర్వహిస్తున్న "సేవా సంకల్ప అభియాన్"లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తల పాల్గొనడం ఈ కార్యక్రమంలో బీజేపీ శింగనమల మండల అధ్యక్షులు బొమ్మన ఓబులరెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మలోబుల్ శివ, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు నరేంద్ర యాదవ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మదిరేపల్లి నరేష్, బీజేపీ శింగనమల మండల సీనియర్ నాయకులు అంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

### -జంక్‌ఫుడ్‌తో చిన్నారుల ఆరోగ్యానికి ముప్పు -విద్యార్థులకు అవగాహన కల్పించిన చిన్నపిల్లల వైద్యులు





ప్రజాభూమి, హిందూపురం టౌన్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీ సత్యసాయి జిల్లా చిన్నపిల్లల వైద్యుల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ కె.కేశవులు, కార్యదర్శి డాక్టర్ రామచంద్రరావు పేర్కొన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లతో చిన్నారులు సంప్రదాయ, సహజసిద్ధమైన ఆహారానికి దూరమై జంక్‌ఫుడ్‌కు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. బుధవారం హిందూపురం రూరల్ మండలం కిరికెర సమీపంలోని ఎల్ఆర్‌జీ విద్యాలయంలో పాఠశాల డైరెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో అఖిల భారత చిన్నపిల్లల వైద్యుల సమాఖ్య సౌజన్యంతో విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేశవులు, డాక్టర్ రామచంద్రరావు. డాక్టర్ ఆదినారాయణలు మాట్లాడుతూ, మారుతున్న సమాజంలో ఆచార వ్యవహారాలతో పాటు ఆహారపు అలవాట్లలోనూ అనేక మార్పులు వచ్చాయని చెప్పారు. గతంలో కుటుంబ సభ్యులు ఇంట్లో తయారు చేసుకునే సంప్రదాయ ఆహారానికి ప్రాధాన్యత ఇచ్చేవారని, ప్రస్తుతం రంగురంగుల ప్యాకెట్లలో లభించే జంక్‌ఫుడ్, కృత్రిమ రుచులకు చిన్నారులు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ఇలాంటి ఆహారాల్లో పోషక విలువలు తక్కువగా ఉండటంతో పాటు అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలు ఉంటాయని వివరించారు. చిన్న వయస్సులోనే జంక్‌ఫుడ్‌కు అలవాటు పడటం వల్ల భవిష్యత్తులో ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు వంటి జీవనశైలి వ్యాధులకు దారితీసే అవకాశముందని వైద్యులు హెచ్చరించారు. పిల్లలు తల్లిదండ్రుల సూచనలను పాటిస్తూ ఇంట్లో తయారు చేసిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు తదితర సహజసిద్ధమైన ఆహార పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం వైద్యుల బృందం విద్యార్థులతో ఆరోగ్యకరమైన, సహజసిద్ధమైన ఆహారం తీసుకుంటామని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటామని, ఆరోగ్యకరమైన ఆహారం ప్రాధాన్యతను తల్లిదండ్రులు, మిత్రులకు తెలియజేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఆరోగ్యంపై పలు అంశాలను వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాల సంజీవని పథకం బాధ్యతలు డ్వాక్రా సంఘాలకు ఇవ్వాలి-ఏఐవైఎఫ్ డిమాండ్



ప్రజాభూమి, హిందూపురం టౌన్ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే బాల సంజీవని పథకం అమలు బాధ్యతలను డ్వాక్రా మహిళా సంఘాలకు అప్పగించాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం హిందూపురం తహసీల్దార్ వెంకటే ష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి కమల్ భాష, పట్టణ అధ్యక్షులు జిలాన్ భాష మాట్లాడుతూ, 26 జిల్లాలను నాలుగు యూనిట్లుగా విభజించి సుమారు రూ.172.80 కోట్ల విలువైన టెండర్లు పిలవడం వల్ల స్థానిక మహిళా సంఘాలు, చిన్న పరిశ్రమలకు అవకాశాలు దూరమవుతున్నాయని తెలిపారు. పథకం కిట్ల ధరలను రూ.241 నుంచి రూ.283.19కు, గిరిజన కిట్‌ను రూ.350 నుంచి రూ.446కు పెంచడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సొంత తయారీ యూనిట్, ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్ వంటి నిబంధనలు ఉన్నప్పటికీ కేవలం సరఫరా అనుభవం ఉన్న సంస్థలకు కాంట్రాక్టులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కేంద్రీయ భండార్, ఎన్‌సీసీఎఫ్ కాంట్రాక్టులను రద్దు చేసి జిల్లాల వారీగా టెండర్లు పిలవాలని, డ్వాక్రా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. టెండర్లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7

గురువారం 17 సెప్టెంబరు 2026

# సర్వీస్ ఛార్జీ వసూలు చేయరాదు..

## వినియోగదారుల ఇష్ట ప్రకారమే చెల్లింపు ఉండాలి - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

ప్రజాభూమి ప్రతినిధి,కడప: హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లు తదితర సంస్థల్లో వినియోగదారుల నుంచి తప్పనిసరిగా సర్వీస్ ఛార్జీ వసూలు చేయరాదని.. వినియోగదారుల హక్కులను కాపాడేందుకు కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ జారీ చేసిన నిబంధనలను సంబంధిత సంస్థలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. 2022 జూలై 4న కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ హోటళ్లు, రెస్టారెంట్లలో సర్వీస్ ఛార్జీ వసూలుకు సంబంధించి స్పష్టమైన నిబంధనలు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. సర్వీస్ ఛార్జీకి సంబంధించిన నిబంధనలపై హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కేంద్రం కోరిందని కలెక్టర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు



గుర్తిస్తే తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. వినియోగదారులపై అనవసరమైన రుసుములు వేయకుండా, బిల్లింగ్‌లో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లు తమ బిల్లుల్లో సర్వీస్ ఛార్జీని ముందుగానే కలిపి వసూలు చేయరాదని తెలిపారు. వినియోగదారుడు స్వచ్ఛందంగా చెల్లిస్తే తప్ప, సర్వీస్ ఛార్జీని తప్పనిసరి చేయకూడదన్నారు. సర్వీస్ ఛార్జీ పేరుతో కాకుండా ఇతర పేర్లతో వసూలు చేసినా, అది సర్వీస్ ఛార్జీ కిందకే వస్తుందని తెలిపారు.

సర్వీస్ ఛార్జీ చెల్లించలేదనే కారణంతో వినియోగదారుడిని హోటల్ లేదా రెస్టారెంట్‌లోకి అనుమతించకుండా ఉండటం, సేవలు అందించకపోవడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. వినియోగదారుడు ఏ సేవకు ఎంత చెల్లించాలో బిల్లులో స్పష్టంగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే సర్వీస్ ఛార్జీకి బదులుగా 'సిబ్బంది సంక్షేమ రుసుము', 'ఉద్యోగుల సంక్షేమ రుసుము', 'సర్వీస్ ఫీజు', 'హాస్పిటాలిటీ ఛార్జీ' వంటి పేర్లు పెట్టి తప్పనిసరిగా డబ్బు వసూలు చేసినా, దానిని సర్వీస్ ఛార్జీగానే పరిగణిస్తామని తెలిపారు. పేరు మార్చినంత మాత్రాన నిబంధనల నుంచి తప్పించుకునే అవకాశం లేదన్నారు. సర్వీస్ ఛార్జీని ఆహార బిల్లులో కలిపి, దానిపై వస్తు సేవల పన్ను విధించకూడదని కూడా నిబంధనల్లో స్పష్టం చేసినట్లు తెలిపారు.

వినియోగదారులు తమకు ఇచ్చే బిల్లును జాగ్రత్తగా పరిశీలించాలని, అదనంగా ఏదైనా రుసుము వసూలు చేస్తున్నారా లేదా అన్నది గమనించాలని సూచించారు. వినియోగదారుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు నిబంధనలను పాటిస్తూ వినియోగదారులకు స్పష్టమైన బిల్లులు ఇవ్వాలని, ఎలాంటి బలవంతపు సర్వీస్ ఛార్జీ వసూలు చేయరాదని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు.

## ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ హర్షణీయం

### - నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి

### - ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



ఏపీపీఎస్సీ గ్రూప్-1లో 163 పోస్టులతో పాటు వివిధ శాఖల్లో మొత్తం 892 పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేయడం హర్షణీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా. నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ.. కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో నిరుద్యోగ భృతి కూడా ప్రధానమైనదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 26 నెలలు గడిచినా ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామన్న హామీని అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. అక్టోబరు 1 నుంచి నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని తులసి రెడ్డి కోరారు.

## దీనబంధు ఆశ్రమానికి కు లక్ష విరాళం

ప్రజాభూమి,పులివెందుల



ఇప్పట్ల గ్రామ సమీపంలోని దీనబంధు మానసిక వికలాంగుల ఆశ్రమ నిర్వాహకుడు జనార్దన్ రెడ్డికి, వేంపల్లి రిటైర్డ్ మండల విద్యాశాఖాధికారి ఆర్. రామమోహన రెడ్డి కుమారుడు, కోడలు వైద్య దంపతులు ఆర్. హరికిరణ్ రెడ్డి, అరుణ కుమారి తమ ముద్దుల తనయ ధృతి సాయి ఐదవ పుట్టినరోజు సందర్భంగా లక్ష రూపాయలు విరాళం బుధవారం జనార్దన్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూగత నాలుగు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం లక్ష రూపాయల చొప్పున ఆశ్రమానికి విరాళం రామమోహన రెడ్డి అందిస్తున్నట్లు ఆయన తెలిపారు .ఈ మొత్తాన్ని వచ్చే పది నెలల పాటు సరుకుల కొనుగోలుకు ఈ మొత్తాన్ని వాడుకోవడం జరుగుతుందని నిర్వాహకుడు కె. జనార్ధన రెడ్డి తెలిపారు. వైద్య దంపతుల సాయం ఆశ్రమానికి ఎంతో ఉపకరిస్తోందని, వారి మంచిమనసుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నామని తెలిపారు. చిన్నారి ధృతి సాయి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, వర్ధిల్లాలని, చదువుల్లో చక్కగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత సేవా సమితి అధ్యక్షుడు రాజు,మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి కుట్రలు ఫలించవు.. ప్రజలు మా వైపే ఉన్నారు - ఎంపీ అవినాష్ రెడ్డి

**రైతులను,మహిళలను,నిరుద్యోగులను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం**


**ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా లక్ష్యం**

ప్రజాభూమి,పులివెందుల



కూటమి నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు తమ వైపే ఉన్నార ని, జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా జెండా ఎగరవే యడం ఖాయమని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు.బుధవారం తన నివాస ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోను చెత్తబుట్టకు పరిమితం చేశారని, హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.రాష్ట్రంలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక కుప్పకూలుతున్నారని, అన్నదాత ఆర్తనాదాలు ఎక్కువయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 26 నెలలు దాటినా సూపర్ సిక్స్ పథకాలు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా లక్ష్యమని, ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే తమ ధ్యేయమని అన్నారు.అంతకు ముందు పులివెందుల నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎంపీకి వినతిపత్రాలు అందజేశారు. కొందరు తమ సమస్యలను నేరుగా వివరించగా, వాటిని సావధానంగా విన్న ఎంపీ అవినాష్ రెడ్డి కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరింపజేశారు.

## వినాయక మండపాలను సందర్శించిన టిడిపి నేతలు



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య ఏరియా, గరుగు వీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి బుధవారం వినాయక మండపాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు సందర్శించారు. ఈ సందర్భంగా వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం



మండపాల నిర్వాహకులు రామముని రెడ్డి, ఆయన సతీమణి సునీత దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. మండపాల నిర్వాహకులతో రామముని రెడ్డి మాట్లాడి వేడుకల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని రామముని రెడ్డి తెలిపారు. వేడుకలు సజావుగా జరిగేలా నిర్వాహకులు సమన్వయంతో వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ క్లస్టర్ ఇన్‌చార్జి మహమ్మద్, నాయకులు గండికోట వెంకట శివ, ఎద్దుల రాము, శివ, నాగేష్, వెంకట రామిరెడ్డి, ఇస్మాయిల్, వెంకటరెడ్డి, తిరుమల్ రెడ్డి, రెడ్డెయ్య, ప్రసాద్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

### - ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ

ప్రజాభూమి, వేంపల్లె



ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ కృషి చేస్తున్నారని తెలిపారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించేందుకు స్క్రీనింగ్ కేంద్రాల ఏర్పాటు, 108 అంబులెన్స్‌ల సంఖ్య పెంపు, జీపీఎస్ అనుసంధానం, వైద్య ఆరోగ్యశాఖలో నియామకాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరు పెంపు వంటి పలు కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆయురారోగ్యాలతో ఉండాలని బీజేపీ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు శ్రీను, శ్రీ వృషభాచలేశ్వర ఆలయ కమిటీ సభ్యుడు సునీల్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సౌభాగ్య, చరణ్, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవన నిర్మాణానికి రూ.25 వేల విరాళం

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని జగనన్న కాలనీకి వెళ్లే 100 అడుగుల రోడ్డు మార్గంలో నిర్మాణంలో ఉన్న స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన సముదాయం నిర్మాణానికి వేంపల్లి విశ్రాంత మండల విద్యాశాఖాధికారి రామిరెడ్డి రామమోహన రెడ్డి కుటుంబ సభ్యులు తమ వంతు సహకారాన్ని అందించారు.వేంపల్లికి చెందిన వైద్య దంపతులు డాక్టర్ హరికిరణ్ రెడ్డి, డాక్టర్ అరుణకుమారి తమ ముద్దుల కుమార్తె ధృతి సాయి ఐదవ పుట్టినరోజు సందర్భంగా రూ.25,000 నగదు విరాళాన్ని సేవాసమితి అధ్యక్షులు రాజుకు అందజేశారు. పుట్టినరోజు వేడుకలను సామాజిక సేవతో అనుసంధానం చేస్తూ నూతన భవన నిర్మాణానికి సహాయం చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ, సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు నిర్మిస్తున్న ఈ భవనం భవిష్యత్తులో ఉచిత విద్యా కార్యక్రమాలు, నేత్రదాన అవగాహన, యువతకు నైపుణ్య శిక్షణలు, సామాజిక సేవా కార్యక్రమాలకు కేంద్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. చిన్నారి ధృతి సాయి పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు అందించిన విరాళం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. వైద్య దంపతులు హరికిరణ్ రెడ్డి, అరుణకుమారి మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని, సేవాసమితి చేపడుతున్న కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సభ్యులు క్రిష్ణారెడ్డి, చాంద్ బాషా తదితరులు పాల్గొని దాతలను అభినందించారు. సేవాసమితి తరఫున ధృతి సాయికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, దాత కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వార్డుల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పలు వార్డుల్లో పర్యటించిన కమిషనర్ తనూజ

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటు న్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ తనూజ హామీ ఇచ్చారు.బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు.పలు వార్డుల్లో పారిశుధ్యం సరిగా లేకపోవడం, డ్రైనేజీలు పూడికతో నిండిపోవడం, మంచినీటి సరఫరాలో అంతరాయం వంటి సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కమిషనర్ తనూజ ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.ఈ పర్యటనలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అజయ్, రెవిన్యూ అధికారి ముని కుమార్ లు పాల్గొన్నారు.

## ప్రముఖ వైద్యుడు విలియం సత్యానంద రెడ్డి భౌతికకాయానికి ఎంపీ అవినాష్ రెడ్డి నివాళి

ప్రజాభూమి,పులివెందుల



ప్రముఖ వైద్యుడు డాక్టర్ విలియం సత్యానంద రెడ్డి (67) గుండెపోటు తో మృతి చెందిన విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నివాళులర్పించారు. బుధవారం ఆయన వైకాపా పులివెందుల ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డితో కలిసి సత్యానంద రెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, డాక్టర్ సత్యానంద రెడ్డి కడపలో దీప నర్సింగ్ హోమ్ ఏర్పాటు చేసి ప్రముఖ వైద్య నిపుణుడిగా రోగులకు విశేష సేవలు అందించారని కొనియాడారు.

## త్రాగునీటి సమస్య పరిష్కరించాలి

### -ఎస్సీ కాలనీ మహిళల ఆవేదన



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం ముమ్మడిగుంటపల్లి ఎస్సీ కాలనీలో నెలకొన్న త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కాలనీ మహిళలు కోరారు. గత కొన్ని రోజులుగా తరచూ నీటి సమస్య తలెత్తుతోందని, త్రాగునీటి బోరు నుంచి నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిని వివరణ కోరగా, త్రాగునీటి సమస్యపై ఇప్పటికే ప్రాంతాన్ని పరిశీలించామని, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### - డీపీఓ రామచంద్ర సూచన



ప్రజాభూమి, సిద్ధవటం: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని కడప డీపీఓ రామచంద్ర పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం సిద్ధవటం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ సిద్ధవటంలో పారిశుద్ధ్య లోపాలు కనిపిస్తున్నాయని, రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తను తొలగించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులతో ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా చెత్త సేకరణ చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలకు త్రాగునీరు, వీధి దీపాల సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పూర్తిగా తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మెహతాబ్ యాస్మిన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రూ.2.10 లక్షలు పలికిన గణేశుని లడ్డూ వేలంపాట

### - ముత్యం నీరజ్‌రాయల్‌కు దక్కిన స్వామి ప్రసాదం



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం భాకరాపేటలో మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడి లడ్డూ వేలంపాట బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. లడ్డూను ముత్యం శంకర్ కుమారుడు ముత్యం నీరజ్‌రాయల్ రూ.2,10,000లకు దక్కించుకున్నారు. వేలంపాటలో భక్తులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం గణనాథుడికి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యువత, మహిళలు, చిన్నారులు రంగులు చల్లుకుంటూ, బాణసంచా కాలుస్తూ, వినాయక భజనలతో సందడి చేశారు. భక్తుల జయజయధ్వానాల మధ్య గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, మహిళలు, చిన్నారులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## వరి పంట కోత ప్రయోగాలపై అవగాహన



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులకు పంట కోత ప్రయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ గణాంక అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ, సిద్ధవటం మండలంలో సాగు చేసిన వరి పంట దిగుబడి అంచనాపై ప్రతి గ్రామంలో క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి, శాస్త్రీయ పద్ధతిలో పంట కోత ప్రయోగాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రమేష్ రెడ్డి, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

### - ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

ప్రజాభూమి, వేంపల్లె

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రవి యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల మధ్య కేక్ కట్ చేసి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ.. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా సత్యకుమార్ యాదవ్ ఎదగడం ఆయన రాజకీయ నిబద్ధతకు నిదర్శనమన్నారు. పార్టీ అభివృద్ధే ధ్యేయంగా, ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తున్నారని తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాలను, ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి దృక్పథాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఆయన కీలకంగా పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు ముద్ది శివకృష్ణ, రంగారెడ్డి, సురేష్, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ జోయల్ వెస్లీ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## అధిక ధరలకు విక్రయిస్తున్న షాపు యజమానులను తక్షణమే కట్టడి చేయండి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
తిరుపతి ఆర్టీసీ బస్టాండ్లలో నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు వస్తువుల విక్రయాలను అరికట్టాలి– దళిత సంఘర్షణ సమితి అధ్యక్షుడు కొత్తపల్లి శంకర్ డిమాండ్. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికులు, భక్తుల అవసరాల కోసం ఏర్పాటు చేసిన దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు . ముఖ్యంగా తాగునీటి బాటిళ్లు, శీతల పానీయాలు మరియు చిరుతిండ్లు తదితర వస్తువులపై అధిక ధరలు వసూలు చేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రయాణికుల రద్దీని ఆసరాగా తీసుకొని ఎమ్మార్పీ రేట్లు కంటే అధిక విక్రయించడం దారుణమని తెలిపారు అదేవిధంగా బస్టాండ్ ఆవరణలో ఉన్నటువంటి టాయిలెట్స్ శుభ్రంగా లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు దీనిపైన వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాస్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో సలహాదారులు డాక్టర్ చంద్రశేఖర్ సభ్యులు సతీష్ పాల్గొన్నారు.

## మండల పరిషత్‌లో ఎంపీటీసీలకు ఘన వీడ్కోలు

**పదవీకాలం ముగియడంతో సన్మానించిన అధికారులు, ప్రజాప్రతినిధులు**



ప్రజా భూమి ప్రతినిధి :
బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ పదవీకాలం ముగియడంతో ఎంపీటీసీలకి పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షుడు ఆరని విద్యానంద రెడ్డి ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేస్తున్న ఎంపీటీసీలకు మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికి శాలువాలు కప్పి సన్మానించారు. ఎంపీడీవో వెంకటరత్నమ్మ మాట్లాడుతూ, తమ పదవీకాలంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎంపీటీసీలు విశేష కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ పొందుతున్న ఎంపీటీసీలు మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులు, సహకారంతో గ్రామాభివృద్ధికి తమ వంతు సేవలు అందించగలిగామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, రహదారులు, విద్య, పారిశుద్ధ్య రంగాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు పాల్గొని పదవీ విరమణ చేస్తున్న సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారికి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలి- ఎంపీడీవో వెంకటరత్నం



ప్రజా భూమి ప్రతినిధి :
బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండలంలో రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి వెంకటరత్నం ఆధ్వర్యంలో బుధవారం మండల కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారుఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరత్నం మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వై. చెంచురామా నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురవయ్య జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గౌస్ బాషా, బీజేపీ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## ఘనంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ప్రథమ వర్ధంతి..!



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:
డీసీఎంఎస్ మాజీ చైర్మన్ స్వర్గీయ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా గడ్డం వారిపల్లి, పనబాకం పంచాయతీలో, చంద్రగిరి పట్టణంలో ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న టవర్ క్లాక్ కూడలి వద్ద ఆయన చిత్రపటం, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం స్థానిక అన్నా క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాలక్షేపం మాటలకు కాకుండా చేతలకే ప్రాధాన్యత ఇచ్చిన నిజాయితీ గల వ్యక్తి సుబ్రమణ్యం నాయుడు అని కొనియాడారు. ఇతరుల అవసరాలను ఏనాడూ సొంత ప్రయోజనాలకు వాడుకోలేదని, డబ్బు కంటే ఇచ్చిన మాటకు, విలువలకు కట్టుబడి జీవించారని గుర్తుచేసుకున్నారు. చంద్రగిరి మండలంలో కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచి భరోసా ఇచ్చిన అసలైన ప్రజా నాయకుడిని కోల్పోవడం నియోజకవర్గానికి, పార్టీకి తీరని లోటని నాయకులు, అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం ఆయన చేసిన నిస్వార్థ సేవలు, అందించిన స్ఫూర్తి ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ ప్రముఖులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేణిగుంటలో విఎస్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జనం.. పాల్గొన్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం.



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
విఎస్ యూత్ శ్రీ సిద్ధి వినాయక నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. 38 ఏళ్లుగా విఎస్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భారీ విగ్రహాలతో ఉత్సవాలు నిర్వహించడం, భక్తులకు, వైభవంగా అన్నదానం చేయడం ప్రశంసనీయమన్నారు. కమిటీ సభ్యుడు ధర్మరాజులు మాట్లాడుతూ. కమిటీ సభ్యులందరి సహకారంతో ఏటా వేడుకలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శీన, పీఆర్, నాగేంద్ర, వెంకటేష్, సదాశివరెడ్డి, భాస్కర్, సూరి, రాజా రాయల్, నరేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి పథకాల పనులను వేగవంతం చేయాలి- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:
జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన అన్ని రకాల తాగునీటి సరఫరా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్. అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా నీరు మరియు పారిశుద్ధ్య మిషన్ కమిటీ సమావేశం నందు కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన పైపులైన్ తాగునీరు అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. నీటి ఎద్దడి ఏర్పడే ప్రాంతాల్లో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో బోర్‌వెల్‌ల లోతు పెంపు, శుభ్రపరిచే పనులు, పంపుసెట్లు, పంపింగ్ మెయిన్లు, విద్యుత్ సరఫరా, జీఐ పైపుల ఏర్పాటు వంటి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని తెలిపారు. మంజూరైన సింగిల్ విలేజ్ మరియు మల్టీ విలేజ్ స్కీముల పనుల తాగునీటి పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, మరియు రెవెన్యూ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భూసేకరణ లేదా ఇతర అంతరాయాలను వెంటనే అధిగమించాలి. నిధుల సద్వినియోగం: కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగిస్తూ, పనులు పూర్తయిన వాటికి వెంటనే బిల్లుల ప్రక్రియ పూర్తి చేయాలని లాగ్‌లో ఉన్న లేదా వెనుకబడిన గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి పనులను పరుగులు పెట్టించాలని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. త్రాగునీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ట్యాంకర్ ట్రిప్పుల వివరాలను ఆఫ్‌లైన్‌లో నమోదు చేసి, నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామస్థాయిలో పాని సమితులు క్రియాశీలకంగా పనిచేసేలా చూడాలని, ప్రతి నెల సమావేశాలు నిర్వహించి సమావేశపు మినిట్స్‌ను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, నీటి నాణ్యతకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణ పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సీఈఓ, రవికుమార్ నాయుడు,జిల్లా పంచాయతీ అధికారి, సుధాకర్ రావు, ఏ రవికుమార్, నాగ శశిభూషణ రెడ్డి, వెంకటేశ్వరి, ఐజూ, లక్ష్మీనారాయణ, జల వనరుల శాఖ అధికారి పి విజయ్ కుమార్ రెడ్డి, అమీర్ బాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## పోషకాహారమే ఆరోగ్యకర సమాజానికి పునాది - ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



ప్రజా భూమి ప్రతినిధి పిచాటూరు
తిరుపతి జిల్లా పిచాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ స్థాయి పోషణ మాసం కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరై పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు మరియు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రతి కుటుంబం సమతుల్య ఆహారం తీసుకునేలా అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి సరైన పోషకాహారం అత్యంత అవసరమని వివరించారు. కార్యక్రమంలో పిచాటూరు ఎంపీడీవో, తహసీల్దార్, వై చంద్రబాబు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎఫ్ఏసీ సీడీపీఓ రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్, ఏపీఓ పాల్గొన్నారు. అలాగే సూపర్‌వైజర్లు బేబీ, శ్రీదేవి, కల్పలత, సుమతి, బజావతి, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు. విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ -- టాటా ట్రస్ట్ సహకారంతో జె. రామకృష్ణ పాల్గొని పోషణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిల్లల పోషణ, వృద్ధి--అభివృద్ధి, తల్లి--శిశు ఆరోగ్యం, పరిశుభ్రత, సమతుల్య ఆహారం, ఆరోగ్యకర జీవనశైలి తదితర తొమ్మిది ప్రధాన అంశాలపై విస్తృతంగా చర్చించారు. అదేవిధంగా పోషకాహార వంటకాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానికంగా లభించే పోషక విలువలు కలిగిన ధాన్యాలు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించి వాటి పోషక ప్రాధాన్యతను వివరించారు. తక్కువ ఖర్చుతోనే ఆరోగ్యకరమైన, సమతుల్య ఆహారాన్ని కుటుంబాలకు అందించవచ్చని అవగాహన కల్పించారు. పోషణ మాసం కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహారంపై చైతన్యం పెంపొందించడంతో పాటు, తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సమతుల్యమైన, వైవిధ్యభరితమైన ఆహారం తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారుకార్యక్రమ విజయానికి ఐసీడీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ -- టాటా ట్రస్ట్ ప్రతినిధులు సహకరించారు

## సేవా దృక్పథంతో బడి సుధాయాదవ్ జన్మదిన వేడుకలు..!

### ఆశ్రమవాసులకు అన్నదాన కార్యక్రమం..



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
చంద్రగిరి మండలం, రామిరెడ్డి పల్లి పంచాయతీలోని అరుణోదయ వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత బడి సుధాయాదవ్ జన్మదినాన్ని



పురస్కరించుకుని ఆయన అభిమాని వినోద్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ, బడి సుధాయాదవ్ జన్మదినం సందర్భంగా ఆశ్రమ నివాసితుల మధ్య ఇలా అన్నదానం నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే సుధాయాదవ్ సుదీర్ఘకాలం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే ఈ రోజు వృద్ధులకు కడుపునిండా అన్నం పెట్టే భాగ్యం కలిగిందని తెలిపారు. అనంతరం ఆశ్రమవాసులకు పూలతో ఆశీస్సులు అందిస్తూ, వారితో కాసేపు సమయం గడిపి వారి శ్రేయస్సును అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ వృద్ధులు సైతం ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో శశి, సందీప్, బద్రీ, చందు, హరి, విష్ణు, కిషోర్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ..!




ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:
ఏకం యూఎస్ఏ వారి ఆర్థిక సహకారంతో, సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కొట్టాల ప్రాథమిక పాఠశాల చదువుతున్న విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలను అం



దజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యా శాఖ అధికారి భాస్కర్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. సిర్డ్స్ సంస్థ కార్యదర్శి మారుపూరి హేమశేఖర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ సంస్థ తరఫున అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా విద్యార్థులు విద్యా సామగ్రి విషయంలో ఇబ్బందులు పడకుండా వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏకం యు.ఎస్.ఎ వారి సహకారం తో నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులలో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రాథమిక ఆదర్శ ప్రధానోపాధ్యాయులు కోదండపాణి మాట్లాడుతూ, విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించడం చాలా అభినందనీయం అని పిల్లలు అందరూ దీన్ని సక్రమంగా ఉపయోగించుకుని కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు రాజేంద్ర బాబు, వెంకటనాగులు, సిర్డ్స్ సంస్థ ప్రతినిధులు తేజోవతి, అశ్విని, సుప్రియా తదితరులు పాల్గొన్నారు.

## నిర్ధారించిన పోలింగ్ స్టేషన్ వివరాలు తెలియజేయుటకు అన్ని పార్టీల నాయకులతో సమావేశం -పాకాల ఎంపీడీఓ వాసుదేవరావు..!

### పాకాల మండలంలోని గ్రామ పంచాయతీలలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబిత ప్రచురణ..



ప్రజా భూమి ప్రతినిధి,
పాకాల (చంద్రగిరి)
తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పాకాల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ వాసుదేవరావు అన్ని పార్టీల నాయకులతో నిర్ధారించిన పోలింగ్ స్టేషన్ వివరాలు తెలియజేయుటకు బుధవారం సమావేశం నిర్వహించి,తెలియజేశారు. ఈ సందర్భంగా పాకాల ఎంపీడీఓ వాసుదేవరావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసి నిర్ధారించిన పోలింగ్ స్టేషన్ వివరాలు తెలియజేయుటకు అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి తెలియజేశామని చెప్పారు.రాబోయే ఎంపీటీసీ,జడ్పిటిసి ఎన్నికల నిమిత్తంక ఓటర్ల జాబితా ప్రచురించడం జరిగిందని,మొత్తం ఓటర్లు 44,173 మంది ఉన్నారు.మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని చెప్పారు.అన్ని పోలింగ్ స్టేషన్ లను ప్రాథమిక పాఠశాల,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయడం జరిగింది అని చెప్పారు.పోలింగ్ స్టేషన్ లను ప్రభుత్వ భవనాలలోనే ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.రాబోయే ఎన్నికల దృష్ట్యా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ చేశామని చెప్పారు.హాజరైన ప్రజా ప్రతినిధులకు ఎన్నికల విషయం పై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శశిరేఖ,ఏవో శాంతి,వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలపై అఖిలపక్ష సమావేశం



ప్రజాభూమి ప్రతినిధి,
వాకాడు
వాకాడు మండలంలో త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ 2026 ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, ఏవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు పురుషోత్తమ రెడ్డి, దువ్వూరు జనార్ధన్ రెడ్డి, మోహన్ నాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు ఏనుగు సుధాకర్ నాయుడు, ఎం. కిరణ్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రతి పంచాయతీ నుంచి రాజకీయ నాయకులను సమావేశాలకు ఆహ్వానించాలని టీడీపీ నాయకులు సూచించారు. ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల పరిస్థితులు స్థానిక నాయకులకు బాగా తెలుసని తెలిపారు. కల్లూరు పోలింగ్ కేంద్రం ఏర్పాటుపై టీడీపీ నాయకుడు దువ్వూరు జనార్దన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ఏర్పాటుపై ప్రజలకు అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. అన్ని అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందిస్తామని అధికారులు తెలిపారు.

## గణనాథుని దర్శించుకున్న గండి ఆంజనేయస్వామి మాజీ చైర్మన్ కావలి కృష్ణ తేజ



ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం యూత్ ఆధ్వర్యంలోస్థానిక బలిజ సంఘం కార్యాలయం లో 32వ సంవత్సరం శ్రీ విఘ్నేశ్వర స్వామివారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం కన్నుల పండుగగా జరిగే ఈ వినాయకుని ఉత్సవాల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తూ, ప్రత్యేక అలంకరణలతో , కోలాటాలతో ఘనంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,బలిజ సంఘం వినాయకుడు అనే ప్రత్యేకతతో ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడుతున్నాయని,వినాయకుని ఉత్సవాలను బలిజ సంఘం యూత్ నాయకులు తోటంశెట్టి సుధాకర్, పాలెం శ్రీ శంకర్ నాయుడు, ఐటీఐ సాయి, దాసరి కార్తీక్ నిర్వహించబడుతున్నాయని వారు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం బలిజ సంఘం కార్యాలయం వద్ద నిర్వహించిన వినాయక వేడుకల్లో మాజీ గండి చైర్మన్ కావలి కృష్ణ తేజ పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంఘ కమిటీ సభ్యుల పిలుపుమేరకు గణనాథుని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సోపాల వీర, పెద్ద వీరయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నశేషునిపై శ్రీనివాసుడు.. హంస వాహనంపై జ్ఞానప్రదాత

## వైభవంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు - గోవింద నామస్మరణతో మార్మోగిన తుమ్మలగుంట

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్
తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన బుధవారం చిన్నశేష వాహనంపై, రాత్రి హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చిన్నశేషునిపై కల్యాణ వెంకన్నగా, రాత్రి హంస వాహనంపై సరస్వతీ స్వరూపుడిగా స్వామివారి దర్శనం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం చిన్నశేష వాహనంపై స్వామివారిని విశేషంగా అలంకరించి పుర వీధుల్లో ఊరేగించారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ వాహన సేవ సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారికి హారతులు సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకులు, ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వాహన సేవలో పాల్గొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

### ఆకట్టుకున్న కళాబృందాలు, భజన బృందాల ప్రదర్శనలు



**స్వామివారికి స్నపన తిరుమంజనం**

ఉదయం, రాత్రి వాహన సేవల్లో విహరించే స్వామివారికి అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి తీసుకువచ్చి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం ఎదుటి ఊంజల మండపంలో స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. టీటీడీ ఎస్వీ మ్యూజిక్ కాలేజీకి చెందిన సంగీత కళాకారులు ఆలపించిన భక్తిగీతాలు భక్తులను అలరించాయి.

**హంస వాహనంపై సరస్వతీ స్వరూపం**

రెండో రోజు రాత్రి హంస వాహనంపై స్వామివారు సరస్వతీ స్వరూపుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. జ్ఞానం, వివేకానికి ప్రతీకగా భావించే హంస వాహనంపై స్వామివారి దర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వేద విద్యార్థుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, పిల్లనగ్రోవులు, డప్పు వాయిద్యాల నడుమ హంస వాహన సేవ సాగింది. కళాబృందాలు, భజన బృందాల ప్రదర్శనలు భక్తులను అలరించాయి. మాడ వీధులు గోవింద నామస్మరణతో మార్మోగాయి.

**స్వామివారికి సారె సమర్పణ**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారికి సారె సమర్పించారు. చిన్నశేష వాహన సేవకు తిరుపతి రూరల్ మండల పరిధిలోని తిరుమలనగర్, న్యూ మంగళం, రణధీర్‌పురం, నవ్వగిరి కాలనీ, మంగళం క్వార్టర్స్, పద్మావతీపురం, ఓటేరు, శ్రీనివాసపురం, తనపల్లి, కుంట్రపాకం పంచాయతీలకు చెందిన భక్తులు సారె తీసుకువచ్చారు. హంస వాహన సేవకు పాకాల మండల పరిధిలోని ఇరంగారిపల్లి, గాదంకి, ఆదెనపల్లి, కె.వడ్డేపల్లి, లింగనపల్లి, పాకాల, సామిరెడ్డిపల్లి, పంటపల్లి, చెన్నుగారిపల్లి, పెద్దబైనపల్లి పంచాయతీలకు చెందిన భక్తులు సారె సమర్పించారు. సారె తీసుకువచ్చిన భక్తులకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు స్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు.

# మద్యం దుకాణాల లైసెన్స్ పునరుద్ధరణకు దరఖాస్తులు చేసుకోండి- డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్


ప్రజా భూమి ప్రతినిధిరామచంద్రాపురం



మండలంలో మద్యం దుకాణాల లైసెన్దారులు తమ లైసెన్సులను పునరుద్ధరణకు ఈనెల 21 లోగా దరఖాస్తులు చేసుకోవాలని చిత్తూర్ ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ అధికారి విజయ శేఖర్ కోరారు. బుధవారం పుత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం దుకాణాల లైసెన్స్ దారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 - 27 ఒక సంవత్సర కాలానికి తమ లైసెన్సులను పునరుద్ధరణకు నోటీసులు అందజేశామన్నారు. పుత్తూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం పరిధిలో 20 మద్యం షాపులు ఉన్నాయని, అన్ని మద్యం షాపుల లైసెన్స్ లో పునరుద్ధరణకు లైసెన్స్ దారులు దరఖాస్తులు చేసుకొని, నిర్ణీత గడువులోగా లైసెన్స్ రూల్స్ ను చెల్లించి లైసెన్స్ ను పునరుద్దించుకోవాలని తిరుపతి జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి నాగమల్లేశ్వర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి మురళీమోహన్, మద్యం దుకాణాల లైసెన్స్ దారులు, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సిబ్బంది పాల్గొన్నారు

# అభ్యంతరాలను లికిత పూర్వకంగా తెలియజేయండి

## అఖిలపక్ష సమావేశంలో ఎంపీడీవో పులిరాం సింగ్.



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం

స్థానిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 40 పోలింగ్ కేంద్రాలు, 26,372 ఓట్లు కలిగిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వాలని ఎంపీడీవో పులిరా సింగ్ కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 స్వర్ణ గ్రామ కార్యాలయాల పరిధిలో త్వరలో నిర్వహించనున్న 9 ఎంపీటీసీలు జడ్పీటీసీ ఎన్నికల కోసం ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాలపై సమీక్ష సమావేశం సమీక్షించి, రాజకీయ పార్టీ నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, జనసేన పార్టీ అధ్యక్షుడు సంజీవ హరి, బిజెపి అధ్యక్షులు ఎన్ జనార్దన్ నాయుడు, వైసీపీ అధ్యక్షుడు చంద్రారెడ్డిలు పాల్గొన్నారు

# అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

## సెప్టెంబర్ 21,22, తేదీలలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన
## ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 21వ తేదీ నుండి 22వ తేదీ వరకు కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పర్యటించనున్న నేపథ్యంలో, ముందస్తు ఏర్పాట్లు భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఖాడా) పీడీ వికాస్ మర్మత్‌తో కలిసి బుధవారం పర్యటనకు సంబంధించిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. తుంసి హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. కుప్పం కొత్తపేటలో ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాల నిర్మాణ స్థలాన్ని, సీఎం సభా వేదికను, కుప్పం బైపాస్ రోడ్డులోని రాజు కాలనీ సర్కిల్ వద్ద రైతు బజార్ ఏర్పాటు స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లలో భాగంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి బహిరంగ సభలు, గ్యాలరీలు ఏర్పాటు , ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి ముచ్చటిస్తారు, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా లబ్ధి పొందిన, నూాచీ లబ్ధి పొందిన రైతు, సంజీవని ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులు , మహిళ పారిశ్రామికవేత్త, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన లబ్ధి పొందిన లబ్ధిదారులు సంబంధిత శాఖ అధికారులు త్వరితగతిన అర్హుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు, వివిధ సంక్షేమ పథకాలలో లబ్ధి పొందిన లబ్ధిదారులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు, శుక్రవారం నుండి సంబంధిత అధికారులు కుప్పంలో మీకు కేటాయించిన విధులలో జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. హెలిప్యాడ్, వేదికలు, రహదారులు, అతిథి గృహాలు తదితర అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, పార్కింగ్, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ హేమంత్ బొడ్డు, డాక్టర్ సురేష్ బాబు, సీఎం వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్, ఆర్డీవో మహమ్మద్ హుస్సేన్, కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.



# సింహా వాహనంపై శ్రీరంగనాథుడు

ప్రజాభూమి, పులివెందుల



పులివెందులోని శ్రీరంగనాథ స్వామి వారి నూలు పూజ మరియు పవిత్ర ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన బుధవారం శ్రీరంగనాథ స్వామి వారు సింహ వాహనంపై కొలువు తీరారు .శ్రీదేవి ,భూదేవి సమేత అయిన శ్రీ రంగనాథుడు సింహవాహనంపై కొలువుండగా ఆలయ అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ, ఫణి శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం స్వామివారికి యధావిధిగా అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఉదయదారులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని సేవ చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ పలగాని రామ్నాథ్ , మరక నాగేశ్వర రావు, శ్రీరంగనాథ ట్రస్ట్ సీఈవో అల్లం రంగనాయకులు రాయల్ , ప్రతినిధులు ఆలమూరు రమేష్, మల్లికార్జున, తొలి శాకు సురేష్ , ఆలయ అధికారి పురుషోత్తం పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతుల ఆదాయం పెంపు..

## ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు కలెక్టర్ డీకే బాలాజి పిలుపు

ప్రజాభూమి ప్రతినిధి,బాపులపాడు:
సంప్రదాయ పంటలతో పోలిస్తే రైతులకు మెరుగైన, నిరంతర ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, కృష్ణా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని రైతులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు. బుధవారం బాపులపాడు మండలం సీతారాంపురం గ్రామంలో రైతు మద్ది శ్రీనివాసరావు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. గతంలో వరి సాగు చేసిన భూమిలో ఆయిల్‌పామ్ సాగును చేపట్టిన రైతుతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి సాగు విధానం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, అంతర పంటల సాగు, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కృష్ణా జిల్లాలోని వాతావరణం, భూముల పరిస్థితులకు అనుకూలంగా ఉన్న ఆయిల్‌పామ్ సాగును రైతులు ప్రత్యామ్నాయ పంటగా పరిశీలించాలని సూచించారు. సంప్రదాయ పంటలైన వరి, మినుములు తదితర పంటల ద్వారా వచ్చే ఆదాయంతో పోలిస్తే, ఆయిల్‌పామ్ ద్వారా దీర్ఘకాలికంగా, క్రమం తప్పకుండా ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులకు ప్రభుత్వం వివిధ రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. మొక్కల నాటే సామగ్రి కోసం సుమారు రూ. 29,500 వరకు, మొదటి నాలుగు సంవత్సరాల్లో ఇతర నిర్వహణ ఖర్చుల కోసం రూ.10,500 వరకు, బోర్‌వెల్ కోసం రూ.50 వేలు పంపుసెట్ కోసం రూ.10 వేలు వరకు ప్రభుత్వ సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ఆయిల్‌పామ్ గెలలు దిగుబడికి వచ్చిన తర్వాత మార్కెటింగ్ విషయంలోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఆయిల్‌పామ్ కొనుగోలు చేసే సంస్థలు ప్రతి 15 రోజులకు ఒకసారి రైతుల పొలాల వద్దకు వచ్చి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయని తెలిపారు. దీంతో రైతులకు క్రమం తప్పకుండా ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. రైతు మద్ది శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ తోట ప్రారంభ దశలో అంతర పంటగా మొక్కజొన్న సాగు చేసుకుంటూ ఆదాయాన్ని కొనసాగించామని కలెక్టర్‌కు వివరించారు. భవిష్యత్తులో ప్రతి 15 రోజులకు ఒకసారి ఆయిల్‌పామ్ ద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో ఇతర పంటల మాదిరిగా ఏడాదికి ఒకసారి ఆదాయం కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ విధానాన్ని జిల్లాలోని ఇతర రైతులు కూడా ఆదర్శంగా తీసుకుని తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించిన ప్రభుత్వ రాయితీలు, సాంకేతిక సహాయం తదితర అంశాల్లో రైతులకు అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కలెక్టర్ వెంట ఉద్యానవన శాఖ అధికారిణి జె జ్యోతి తదితరులు ఉన్నారు.



# వినాయకుని లడ్డూ వేలంలో రూ. 2.60 లక్షలకు లడ్డు దక్కించుకున్న గండి జయ కుమార్ యాదవ్

ప్రజాభూమి పులివెందుల



పులివెందుల పట్టణంలోని శ్రీరామ్ హాల్ రోడ్డులో ఫ్రెండ్స్ యూత్ గణనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం పాట అత్యంత ఉత్సాహంగా సాగింది.ఫ్రెండ్స్ యూత్ సభ్యులు కొర్రపాటి నవీన్, కొర్రపాటి కిరణ్, కొండారెడ్డి, సుధాకర్ రెడ్డి, రంగనాథ్, ప్రతాప్ ల ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.బుధవారం నిర్వహించిన వేలం పాటలో వినాయకుని లడ్డూను గండి జయకుమార్ యాదవ్ రూ. 2,60,000లకు దక్కించుకున్నారు. వేలం పాట దక్కించుకున్న భక్తుడి ఇంటికి బ్యాండ్ మేళాలతో లడ్డూను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గండి జయకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఆది దేవుడు వినాయకుని లడ్డూను వేలం పాటలో దక్కించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం వేలం పాటలో పాల్గొన్నప్పటికీ ఈ సంవత్సరం లడ్డూ దక్కడం సంతోషంగా ఉందన్నారు.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వినాయకుని నిమజ్జనాన్ని గంగమ్మ చెరువు వద్ద ఘనంగా నిర్వహించారు.

# కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్య సేవల పరిశీలన

## పంచకర్మ వైద్యం, యోగా, ఔషధాల లభ్యతపై ఆరా

ప్రజాభూమి ప్రతినిధి,కానుమోలు:

కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కే. బాలాజీ కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సౌకర్యాలను పరిశీలించారు. ఆయుష్ వైద్యాధికారి డా. కె. వాహినిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పంచకర్మ వైద్యం, మహిళలు, పురుషులకు ప్రత్యేక సౌకర్యాలు, యోగా సేవలు అందుబాటులో ఉన్నాయని డా. వాహిని కలెక్టర్‌కు వివరించారు. కేరళ నుంచి ఖరీదైన ఆయుర్వేద మందులను ప్రభుత్వం సరఫరా చేస్తుండటంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు.కానుమోలు డిస్పెన్సరీ దేశంలోనే తొలి ఆయుష్ సోలార్ డిస్పెన్సరీగా ప్రత్యేకత కలిగి ఉందని, ఆసుపత్రి ప్రాంగణంలో సుమారు 40 రకాల ఔషధ మొక్కలను పెంచుతున్నట్లు వివరించారు. స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బయోమెడికల్ వ్యర్థాల విభజన, కలర్ కోడింగ్ విధానాన్ని పాటిస్తున్నామని, సీూవీ మార్గదర్శకాల మేరకు రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా, చక్కగా నిర్వహిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకు కలెక్టర్ డి.కే. బాలాజీ డా. కె. వాహినిని అభినందించారు.



# వినాయక చవితి ఉత్సవాలలో శ్రీకాళహస్తి -ఎమ్మెల్యే సతీమణి సందడి

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలంలోని గురవరాజుపల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా సాగాయి. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడో రోజు శ్రీ గణనాథుని పూజా కార్యక్రమాలలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ప్రత్యేకంగా అలంకరించిన వినాయక మండపాన్ని సందర్శించిన రిషితా రెడ్డి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు, కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. గ్రామ ప్రజలందరికీ ఈ సందర్భంగా ఆమెకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తేనెపల్లి నారాయణ, డాక్టర్ జనార్దన్, యూనిట్ ఇంచార్జ్ నారాయణలతో పాటు స్థానిక నాయకులు నిరంజన్, ముని, భాస్కర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# గ్రూప్ 1 అభ్యర్థులకు మున్సిపల్ కమిషనర్ తనూజ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మున్సిపల్ కమిషనర్ తనుజ గ్రూప్-1 జాబ్ నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా, ఈ శనివారం (19-09-2026 )న ఉదయం 11 గంటలకు పులివెందుల మున్సిపల్ కార్యాలయంలోని ఓల్డ్ బిల్డింగ్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు గ్రూప్-1 నోటిఫికేషన్‌పై అవగాహన సమావేశం నిర్వహించనున్నారు.ఈ సమావేశంలో కమిషనర్ తనూజ తమ అనుభవాన్ని పంచుకోవడంతో పాటు, పరీక్షకు ఏ విధంగా సమర్థవంతంగా ప్రిపేర్ కావాలి, ఎలా చదవాలి అనే అంశాలపై వివరించనున్నారు.కావున అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు..

# పండుగ భక్తిని చాటాలి

-ప్రశాంతంగా, సంప్రదాయబద్ధంగా నిమజ్జనాలు నిర్వహించాలి -జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతత, క్రమశిక్షణ, సంప్రదాయ పరిరక్షణకు ప్రతీకగా నిలిచి అందరికీ ఆదర్శంగా ఉండాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ సూచించారు. పండుగ భక్తిని చాటాలి తప్ప డీజే శబ్దాన్ని కాదని స్పష్టం చేశారు. భక్తి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని ఉత్సవ కమిటీలు, యువతకు తెలిపారు. హిందూపురంలోని సాయితేజ ఫంక్షన్ హాల్‌లో బుధవారం గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై పోలీసుల ఆధ్వర్యంలో ఉత్సవ సమితుల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ ఉత్సవ కమిటీ సభ్యులు, యువతకు పలు సూచనలు చేశారు. హిందూపురంలో సాధారణంగా 11వ రోజు నిర్వహించే గణేష్ నిమజ్జనాలను ఈసారి ఏడో రోజుకే నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు, ప్రజలు తమ సమన్వయంతో నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. హిందూపురంతో పాటు పుట్టపర్తి, పెనుకొండ ప్రాంతాల్లోనూ నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమైన నేపథ్యంలో బందోబస్తు కోసం హిందూపురం నుంచి అదనపు పోలీసు బలగాలను ఇతర ప్రాంతాలకు పంపించినట్లు తెలిపారు. కదిరి నుంచి కూడా అవసరమైన ప్రాంతాలకు సిబ్బందిని కేటాయించినట్లు వెల్లడించారు. నిమజ్జనాలు 11, 15, 18, 21వ రోజుల వరకు కొనసాగితే పోలీసు






సిబ్బందికి కుటుంబాలతో గడిపేందుకు, వ్యక్తిగత పూజలు చేసుకునేందుకు కూడా సమయం దొరకని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు తమ వ్యక్తిగత సమయాన్ని పక్కనపెట్టి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో జనరేషన్ గ్యాప్ కారణంగా యువతతో కమ్యూనికేషన్‌లో కొన్ని సమస్యలు ఏర్పడుతున్నాయని ఎస్పీ అన్నారు. 16 నుంచి 26 సంవత్సరాల మధ్య వయసున్న యువతకు పెద్దలు తమ అనుభవాల ద్వారా విషయాలను పూర్తిగా అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా ప్రభావంతో యువతకు ప్రత్యేకమైన ప్రపంచం ఏర్పడిందని, ఉత్సవ కమిటీల్లోని పెద్దలు యువతతో స్నేహపూర్వకంగా మాట్లాడి పండుగ నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను వివరించాలని సూచించారు. పెద్దలు, యువత కలిసి పనిచేస్తే హిందూపురం గణేష్ ఉత్సవాలను రాబోయే సంవత్సరాల్లో మరింత ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. హిందూపురంలో గణేష్ నిమజ్జనాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారని విన్నానని, ఈసారి ప్రత్యక్షంగా చూసే అవకాశం రావడం సంతోషంగా ఉందని ఎస్పీ తెలిపారు. నిమజ్జన వేడుకల్లో డీజేలకు అధిక ప్రాధాన్యత ఇవ్వకుండా సంప్రదాయ కళాకారులు, కళారూపాలను ప్రోత్సహించాలని యువతకు సూచించారు. అధిక శబ్దం వల్ల వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, ప్రజల ప్రశాంతతకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్ల వినియోగానికి అనుమతి లేదని, శబ్ద తీవ్రత కూడా నిర్దేశిత పరిమితుల్లోనే ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. పండుగ భక్తిని చాటాలి, డీజే శబ్దాన్ని కాదు అనే సందేశంతో యువత సంప్రదాయాలను గౌరవిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. బాపూజీనగర్, అంబేద్కర్‌నగర్, గరిడి ప్రాంతాలతో పాటు పేట వెంకటరమణ స్వామి దేవాలయం వద్ద రహదారులు ఇరుకుగా ఉన్నందున భారీ విగ్రహాల నిమజ్జన ఊరేగింపులకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని కోరారు. సాయంత్రం వేళ విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తకుండా ప్రతి విగ్రహం సాయంత్రం 5 గంటలలోపు ప్రధాన రహదారికి చేరుకునేలా యువత ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు కేవలం వినోదానికి పరిమితం కాకుండా భక్తి, సంప్రదాయం, సంస్కృతి, సామాజిక ఐక్యతను చాటేలా ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. హిందూపురంలో నిర్వహించే గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతత, క్రమశిక్షణ, సంప్రదాయ పరిరక్షణ, ప్రజా భద్రతలో ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు రావాలని కోరారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ, డ్రోన్ కెమెరాల పనితీరును పరిశీలించి నిమజ్జన సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.వి. మహేష్, ఆర్డీవో కరుణసాగర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, సీఐలు ఆంజనేయులు, అబ్దుల్ కరీం, జనార్ధన్, ప్రసాద్‌బాబు, ఇస్మాయిల్, ఎస్ఐలు, కమిటీ నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు కసరత్తు-ముసాయిదా పోలింగ్ కేంద్రాలపై అఖిలపక్ష సమావేశం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి హిందూపురం మండలంలో ఎన్నికల అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా బుధవారం హిందూపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎంపీడీవో దావోదరమ్మ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. రానున్న 2026 ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించే ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా జాబితాను అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. పోలింగ్



కేంద్రాల ఏర్పాటు, ఓటర్లకు అందుబాటులో ఉండే ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల స్థానం, ఓటర్లు సులభంగా చేరుకునేలా ఉండాల్సిన అంశాలతో పాటు అవసరమైన మౌలిక వసతులపై ప్రతినిధులతో చర్చించారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు, సూచనలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో దావోదరమ్మ సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా సాగేందుకు అన్ని వర్గాల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 15న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ప్రచురించారు. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, అభ్యర్థనలు స్వీకరించనున్నారు. అనంతరం వాటిని పరిశీలించి సెప్టెంబర్ 18న జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం తీసుకుని సెప్టెంబర్ 19న పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రకటించే ప్రక్రియ కొనసాగనుంది. ఈ క్రమంలో మండల స్థాయిలో ఎంపీడీవోలే పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా తయారీ, అభ్యంతరాల స్వీకరణ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణ వంటి ప్రక్రియలను పర్యవేక్షించాల్సి ఉంది. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఓటర్ల జాబితాల ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, తుది జాబితా రూపకల్పన తదితర ప్రక్రియలు దశలవారీగా కొనసాగుతున్నాయి. హిందూపురం మండలానికి సంబంధించి ముసాయిదా పోలింగ్ కేంద్రాలపై సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు, అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ పి.వి. నంజరాజ్ అరస్‌కు టిప్పు సుల్తాన్ పురస్కారం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

మైసూరులోని శ్రీకృష్ణరాజ వడయార్ రాజవంశీకుల స్వగృహంలో ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, కన్నడ కవి, రచయిత, సినీ నిర్మాత, దర్శకుడు ప్రొఫెసర్ పి.వి. నంజరాజ్ అరస్‌కు 'టిప్పు సుల్తాన్ షహీద్ సాహిత్య జాతీయ పురస్కారం--2026'ను అందజేశారు. అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు, కవి, రచయిత, సామాజిక సేవకులు కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో, అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్. హనుమంతు అధ్యక్షతన, కన్నడ కవి, రచయిత ప్రొఫెసర్ వడ్డెగెరె నాగరాజయ్య సారథ్యంలో బుధవారం ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. మైసూరు చరిత్ర, ఒడయార్ రాజవంశం, షహీద్ టిప్పు సుల్తాన్ కాలం నాటి చారిత్రక విశేషాలపై ప్రొఫెసర్ నంజరాజ్ అరస్ చేసిన విలువైన పరిశోధనలు, చరిత్రను ప్రజలకు చేరువ చేసే కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. అలాగే కన్నడ సాహిత్యానికి ఆయన అందించిన విశిష్ట రచనలు, చలనచిత్ర రంగంలో నిర్మాతగా, దర్శకుడిగా చేసిన కృషి, సమాజంలో చారిత్రక అవగాహన పెంపొందించేందుకు చేస్తున్న సేవలను గుర్తిస్తూ



సత్కరించారు. ప్రొఫెసర్ నంజరాజ్ అరస్ రచించిన 'టిప్పు మాన్యత సిగద సుల్తాన్' కన్నడ పుస్తకానికి ఈ జాతీయ పురస్కారం దక్కడం పట్ల కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ అభినందనలు తెలిపారు. ఆయన పరిశోధనలు, రచనలు, ఆలోచనలు భావితరాలకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. మత సామరస్యం, పరమత సహనం, సోదరభావం, వసుధైక కుటుంబ స్ఫూర్తి దేశవ్యాప్తంగా వెల్లివిరియాలని కోరారు. ఇదిలా ఉండగా కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ త్వరలో రచించనున్న 'శ్రీ శారదామాత శృంగేరీ పీఠ రక్షకుడు షహీద్ టిప్పు సుల్తాన్' పుస్తకానికి ప్రొఫెసర్ పి.వి. నంజరాజ్ అరస్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్‌ను ప్రొఫెసర్ నంజరాజ్ అరస్ టిప్పు సుల్తాన్ చిహ్నంతో కూడిన దుశ్శాలువాతో సత్కరించి, తన రచన 'టిప్పు మాన్యత సిగద సుల్తాన్' కన్నడ పుస్తకాన్ని అందజేశారు.

## ధృతిసాయి పుట్టినరోజు సందర్భంగా రూ.25 వేల విరాళం

– దివ్యాంగ చిన్నారుల సంక్షేమానికి కుటుంబ సభ్యుల సహకారం

ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని భవిత దివ్యాంగ వనరుల కేంద్రంలోని చిన్నారుల సంక్షేమం కోసం విశ్రాంత ఎంఈఓ రామిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు తమ వంతు సహకారం అందించారు. ఆయన మనవరాలు ధృతిసాయి ఐదవ పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు, వైద్య దంపతులు డాక్టర్ హరికిరణ్ రెడ్డి, డాక్టర్ అరుణకుమారి కేంద్రానికి రూ. 25 వేల



విరాళాన్ని ఎంఈఓ–1 వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. విరాళంగా అందించిన మొత్తంతో కేంద్రంలో విద్యాభ్యాసం చేస్తున్న దివ్యాంగ చిన్నారులకు ఏడాది పాటు ప్రతిరోజూ పాలు, పండ్లు పంపిణీ చేయాలని దాతలు సూచించారు. దివ్యాంగ చిన్నారుల సంక్షేమానికి కుటుంబ సభ్యులు సహకరించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధృతిసాయికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, దాత కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ స్టాలిన్ ఐజాక్, ఉర్దూ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, భవిత దివ్యాంగ వనరుల కేంద్రం సిబ్బంది యశోద, సుజాత, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డినగర్ రామాలయంలో ఘనంగా మట్టి వినాయకుని పూజలు

### భక్తిశ్రద్ధలతో 1,70,000 లడ్డూ వేలం పాట.. మేళతాళాలతో నిమజ్జన వేడుకలు

ప్రజాభూమి పోరుమామిళ్ల :

కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని రెడ్డినగర్ రామాలయంలో కొలువుదీరిన వరసిద్ధి మట్టి వినాయకునికి మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బుధవారం పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో లడ్డూ, వివిధ రకాల ప్రసాద వస్తువుల వేలం పాటను నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ వేలం పాటలో లడ్డూలు, లక్ష్మీ నాణేలు, లక్ష్మీ గవ్వలు, చాక్లెట్ల దండ, చెరుకు గడలు తదితరాలను భక్తులు పోటీపడి దక్కించుకున్నారు. వేలం పాటలో రూ. 1,70,000లకు పెద్ద లడ్డూను పిట్ట నరసింహులు దంపతులు, రూ. 49,000లకు చిన్న లడ్డూను ప్రగతి శ్రీనివాస్ అల్లుడు--కూతురు పూల చిన్న బాబు, శ్రీ దంపతులు దక్కించుకున్నారు. అలాగే రూ. 26,000లకు లక్ష్మీ నాణేలను పోలు ప్రత్యూష, రూ. 8,200లకు లక్ష్మీ గవ్వలను, రూ. 21,000లకు చాక్లెట్ల దండను అవినాష్ రెడ్డి, రూ. 5,500లకు చెరుకు గడలను వేలం పాటలో దక్కించుకున్నారు. వేలం పాటలో పాల్గొని ప్రసాద వస్తువులను దక్కించుకున్న భక్తులను ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి మెమెంటోలు, శాలువాలతో ఘనంగా





సత్కరించారు. అనంతరం వేలం పాటలో వస్తువులను దక్కించుకున్న భక్తులను మేళతాళాల నడుమ సాంప్రదాయబద్ధంగా వారి ఇళ్ల వద్దకు తీసుకెళ్లారు. తదుపరి వరసిద్ధి మట్టి వినాయకుని విగ్రహాన్ని పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి జైకొడుతూ, భక్తిగీతాలు, మేళతాళాల మధ్య ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా భక్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, ఆలయ చైర్మన్ పాలకొలను రామసుబ్బారెడ్డి, గిరి ప్రణీత్ రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు, మహిళలు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం, పురవీధులు భక్తులతో సందడిగా మారాయి. అనంతరం తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు.

## పాపాగ్నిలోకి వెలిగల్లు నీరు విడుదల చేయాలి

– చీఫ్ ఇంజనీర్‌కు ఎంపీ అవినాష్ రెడ్డి విజ్ఞప్తి

ప్రజాభూమి,పులివెందుల



చక్రాయపేట, వేంపల్లి మండలాల్లో తీవ్రంగా ఉన్న తాగునీటి, సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వెలిగల్లు రిజర్వాయర్ నుంచి 0.20 టీఎంసీ నీటిని పాపాగ్ని నదిలోకి విడుదల చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్‌ను కోరారు. బుధవారం చక్రాయపేట మండల రైతులు, ప్రజలు పులివెందులలోని ఎంపీ నివాసానికి చేరుకుని తమ బాధను వినిపించారు. పాపాగ్ని నదిలోని ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో నీటిమట్టం పూర్తిగా పడిపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాపాగ్ని నదిలోకి వెలిగల్లు నుంచి నీటిని విడుదల చేసి ఇన్‌ఫిల్ట్రేషన్ బావులను పునరుద్ధరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎంపీ అవినాష్ రెడ్డి.. ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్‌కు లేఖ రాయడంతో పాటు ఫోన్‌లో మాట్లాడి ప్రజల తాగునీటి, రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యవసరంగా 0.20 టీఎంసీ నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రెండు లక్షల రూపాయలకు లడ్డు కైవసం చేసుకున్న వెంకట రమణా రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం అగ్రహారం గ్రామంలో కొలువై ఉన్న వినాయక విగ్రహం వద్ద బుధవారం వినాయక చవితి లడ్డు వేలం పాట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ లడ్డు వేలంపాటలో అక్షరాల 2 లక్షల రూపాయలకు పోచం రెడ్డి వెంకట రమణారెడ్డి (బాబురెడ్డి) లడ్డు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రమణారెడ్డి కుటుంబ సభ్యులను దుశాల్వాలతో, పూలహారాలతో సత్కరించారు. అనంతరం వేలం పాటలో కైవసం చేసుకున్న లడ్డును కమిటీ సభ్యులు ఆయన తల పైన పెట్టి బ్యాండ్ వైద్యాలతో ఆయన ఇంటి వద్దకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి లడ్డు ప్రసాదాన్ని వేలం పాటలో కైవశం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ లడ్డును ఇంటి చుట్టుపక్కన ఉన్నవారికి, బంధువులకు, స్నేహితులకు, పంపించడం జరుగుతుందన్నారు. అలాగే మిగిలిన ప్రసాదాన్ని పంట పొలాల్లో చల్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

– సిబ్బందికి పలు సూచనలు చేసిన సీఐ నరసింహులు

ప్రజాభూమి, వేంపల్లె





వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లలో భాగంగా సీఐ టి. నరసింహులు బుధవారం నందిపల్లె వాటర్ ట్యాంక్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి విధులపై పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా పూర్తయ్యేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని, భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సీఐ నరసింహులు సూచించారు.

## హరిహర పుత్రునికి విశేష పూజలు

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు, కోతి సమాధి సమీపంలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ వ్యవస్థాపకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, బిల్వార్చన, అష్టోత్తర శతనామావళి తదితర పూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులతో కార్తీక మాసంలో, 365 రోజుల్లో ప్రతి బుధవారం స్వామివారికి భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు, ధూప దీప నైవేద్యాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి మాసంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం రోజున కూడా విశేష పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంకాలం భక్తుల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు, అయ్యప్ప స్వాములకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి సత్య కుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమం శాఖా మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను బుధవారం స్థానిక హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడికుర్తి హరి ఆధ్వర్యంలో పట్టణ బిజెపి అధ్యక్షురాలు 11వ వార్డు మాజీ కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి అధ్యక్షతన జన్మదిన వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలు, గర్భిణీలు, రోగులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్, రమేష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భాగ్యలక్ష్మి గౌడ్, మాజీ పార్లమెంటు కన్వీనర్ సీనియర్ నాయకులు రమణమూర్తి, బిజెపి శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. అమర దేవేంద్ర, యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రవితేజరెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ శ్రీమతి గీతాంజలి, లక్ష్మి, అనిత, భారతి, రమ్య, సునీల్, జయకృష్ణ, దత్తు, రవి, వసంత, చేనేత సెల్ నాయకులు మురళి, రవి, చంద్రాయుడు, పాపన్న, కార్యదశి సుధాకర్, కంచిసముద్రం వేణు, నాగరాజు, ధవళేశ్వర్, మంజు, సాయి వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ్ మాసం

– గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషణపై అవగాహన

– ఐసీడీఎస్ సూపర్వైజర్. స్వర్ణలత

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని గాండ్ల వీధి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 9వ పోషణ్ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని ఐసీడీఎస్ సూపర్వైజర్ డాక్టర్ స్వర్ణలత తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహార పరిరక్షణ లక్ష్యంగా ప్రతి ఏటా సెప్టెంబరులో పోషణ్ మాసం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు, పండ్లతో కూడిన సమతుల్యాహారం తీసుకోవాలని సూచించారు. చిన్నారి గర్భంలో ఉన్నప్పటి నుంచి రెండేళ్ల వయస్సు వరకు అందించే పోషకాహారం శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో కీలకమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు వాడటంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని డా. స్వర్ణలత సూచించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక పౌష్టికాహార పదార్థాలు, ఆకుకూరలతో పోషణ్ మేళా నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆయా, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

### కొవ్వూరులో 62 మంది లబ్ధిదారులకు

# రూ.36.85 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

కొవ్వూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తాళ్లపూడి, కొవ్వూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ ఓ సి చెక్కులను కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ముప్పిడి వెంకటేశ్వంరావు బుధవారం అందజేశారు. తాళ్లపూడి మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు రూ.21,32,976, కొవ్వూరు మండలానికి చెందిన 36 మంది లబ్ధిదారులకు రూ.15,52,824 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. మొత్తంగా 62 మంది లబ్ధిదారులకు రూ.36,85,800 విలువైన సీఎంఆర్ ఎఫ్ చెక్కులు అందజేశారు. అదేవిధంగా పసివేదల, కాపవరం, మద్దూరు గ్రామాలకు చెందిన ముగ్గురికి వైద్య చికిత్స నిమిత్తం రూ.11,01,991 విలువైన మూడు ఎల్ ఓ సి లు మంజూరైనట్లు తెలిపారు. రూ.47,87,791 విలువైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందించారు. ఏ పి పి ఎస్ సి గ్రూప్-1 వ్యవహారంపై జగన్ సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు ఏ విధంగా నిర్వీర్యమయ్యాయో ఏ పి పి ఎస్ సి గ్రూప్-1 పరీక్షల వ్యవహారం మరోసారి స్పష్టం చేస్తోందని అన్నారు. ఏ పి పి ఎస్ సి గ్రూప్-1 నియామకాలపై జరుగుతున్న సిట్ దర్యాప్తులో పలు అవకతవకలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనం, ఓ ఎం ఆర్ షీట్లలో మార్పులు, డూప్లికేట్ ఓ ఎం ఆర్ బార్‌కోడ్ షీట్ల ముద్రణ, నిబంధనలకు విరుద్ధంగా మూల్యాంకనం, అనధికార వ్యక్తులతో పేపర్లు దిద్దించడం వంటి అంశాలు దర్యాప్తులో వెల్లడయ్యాయని తెలిపారు. 736 మంది అభ్యర్థుల జవాబు పత్రాలను పరిశీలించగా 718 మంది ఓ ఎం ఆర్ షీట్లలో మార్పులు గుర్తించినట్లు, ఎంపికైన 165 మందిలో 160 మంది పత్రాల్లో కూడా మార్పులు గుర్తించినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైందని అన్నారు. ఏ పి పి ఎస్ సి జవాబు పత్రాలను మూడుసార్లు ఎందుకు మూల్యాంకనం చేశారని, చైర్మన్ అనుమతి లేకుండా డిజిటల్ మూల్యాంకనం ఎందుకు నిర్వహించారని, డూప్లికేట్ ఓ ఎం ఆర్ షీట్లు ఎందుకు ముద్రించారని, అనధికార వ్యక్తులతో మూల్యాంకనం ఎందుకు చేయించారని ప్రశ్నించారు. ఈ వ్యవహారానికి బాధ్యత ఎవరిదో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. డీఎస్సీ అంశంపై మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పి పి ఎస్ సి గ్రూప్-1 వ్యవహారంపై కూడా స్పందించి నిరుద్యోగ యువతకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే కోరారు. యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో తప్పిదాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టూ-మెన్ కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, శివరామకృష్ణ, టీవీ రామారావుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హౌలా ప్రసాద్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని నిరసన



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

హౌలా ప్రసాద్ అలియాస్ హమారా ప్రసాద్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద మాలమహాసేన ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తగిన విధంగా స్పందించాలని డిమాండ్ చేశారు. మాలమహాసేన జాతీయ అధ్యక్షులు ఆలగ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లెం ఏడుకొండలు, కమ్మిన అగస్టిన్, ఎం ఎం ఎస్ ప్రధాన కార్యదర్శి సారిపల్లి పెద్దిరాజు, ఎం ఎం ఎస్ ఉపాధ్యక్షుడు వాసే జైపాల్, వాసే రత్నం, రాష్ట్ర నాయకులు తోట రాజు, జిల్లా అధ్యక్షులు నిట్ట శ్రీను, ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్రావు, కందుల రమేష్, మేతర అజయ్ బాబు, మాలసేన అధ్యక్షులు ఎరికిపాటి విజయ్, బహుజన సేన అధ్యక్షులు మత్తే బాబి, జై భీమ్ భారత పార్టీ జిల్లా అధ్యక్షులు గొల్ల నరేష్ పాల్గొన్నారు. అలాగే నాయకులు నేడిగట్టు సుదీర్, బంటు వెంకటేశ్వరరావు, మోత శైలజ, దండి సలోమి తదితర నిరసన కార్యక్రమంలో పాల్గొని తమ డిమాండ్లను వ్యక్తం చేశారు.

## పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కరించాలని ధర్నా



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండలంలోని పోలవరం నిర్వాసిత ప్రజల సమస్యల పరిష్కరించాలని కోరుతూ, మండల సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం చింతూరు ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. రామవరం గ్రామంలోని 104 కుటుంబాలను ముంపులో చేర్చి హౌస్ స్ట్రక్చర్ వాల్యువేషన్ డబ్బులు చెల్లించాలని, శ్రీరామగిరి గ్రామపంచాయతీలో సాగులో ఉన్న 62 ఎకరాల అసైన్మెంట్ భూములను సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని, ఆర్‌డఆర్ ప్యాకేజీ ఇవ్వని వారికి ఆర్‌డఆర్ ఇవ్వాలని, లేడర్ సర్వే లో కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతున్నట్లు చూయించలేదని మరలా రీ సర్వే చేసి గుర్తించాలని అధికారులను కోరారు. మండలంలోని పోలవరం నిర్వాసితులు సాగు చేస్తున్న అన్ని రకాల సాగు భూములకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం కొరకు ఐటీడీఏ ముందు ధర్నా చేసి ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్‌కి, స్థానిక ఐటిడిఏ పిఒ శుభం నొక్వాల్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. రామవరం లోని 104 కుటుంబాల సమస్య పరిష్కారం చేస్తామని, గిరిజనులు సాగు చేస్తున్న అసైన్మెంట్, డిఫారం, ఆర్ వో ఎఫ్ ఆర్ పట్టా భూములకు పూర్తి స్థాయి నష్టపరిహారం ఇస్తామని, మరల రీ సర్వే చేస్తామని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిస్థాయిలో ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల ఎంపీపీ కారం లక్ష్మి, నాయకులు కారం సుందరయ్య, పులి బొజ్జి, సీసం సురేష్, పులి కన్నయ్య, రామవరం గ్రామ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా విడుదలపై అభ్యంతరాల సేకరణ సమావేశం



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (ఎం పి టి సి), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జడ్పిటిసి) లకు రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణ నిమిత్తం, వి.ఆర్.పురం మండలానికి సంబంధించిన డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితానులి ప్రచురించడం జరిగింది. ఈ డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల పై అభ్యంతరాల సేకరణ నిమిత్తం స్థానిక రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం వద్ద బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలకు గాను 24 పోలింగ్ కేంద్రాలను ముసాయిదాగా గుర్తించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల ప్రకారం ఈ జాబితాను ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మరియు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రచురించారు.

దీనిపై అభ్యంతరాలు, సూచనలను తెలుసుకోవడం కొరకు బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం, వి.ఆర్.పురం నందు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులు, పత్రికా మిత్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అందరి సూచనలు, అభ్యంతరాలను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమం మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. ఇమ్మానియేల్, ఎంపీపీ కారం లక్ష్మి, తెలుగుదేశం మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్, జనసేన అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, బిజెపి అధ్యక్షుడు ముత్యాల రాంబాబు, సిపిఎం పార్టీ నుండి కారం సుందరయ్య, పులి సంతోష్ కుమార్, పూనెం ప్రదీప్ కుమార్, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్‌తో రైతులకు శాశ్వత ఆర్థిక భరోసా

### అంతర్ పంటలతో అదనపు ఆదాయం పొందాలి: మంత్రి పార్థసారథి



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామంలో బుధవారం జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్' కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిదిగా పాల్గొని ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. అనంతరం రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటల నుంచి వాణిజ్య పంటల వైపు అడుగులు వేయాలని, ఆయిల్ పామ్‌తో పాటు అంతర్ పంటలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందాలని సూచించారు. మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమై సుమారు 30 ఏళ్ల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఏలూరు జిల్లాలో 52 వేల మంది రైతులు 1.60 లక్షల ఎకరాల్లో, నూజివీడు నియోజకవర్గంలో 8 వేల మంది రైతులు 22,965 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. గత రెండేళ్లలో జిల్లాలో 22,227 మంది రైతులకు 53,600 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు రూ.34.24 కోట్ల రాయితీ మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఆయిల్ పామ్ విస్తరణతో వంటనూనెల దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని, రైతులకు అవసరమైన రాయితీలు, నాణ్యమైన మొక్కలు, సాంకేతిక సహకారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి, సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, జిల్లా ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## వేద పాఠశాలలో భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

స్థానిక వేద పాఠశాలలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రులలో భాగంగా మూడో రోజు కృష్ణ యజుర్వేద పారాయణం భక్తిపూర్వకంగా నిర్వహించారు. శ్రీ వేదాంతం సత్య ఫణికృష్ణ దత్త శర్మ, శ్రీ వేదాంతం పార్థసారథి రాఘవ భట్టర్, శ్రీ గుంటూరు లక్ష్మీ నరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో వేద పారాయణం కొనసాగింది. ప్రతిరోజూ గణపతి హోమాన్ని శాస్త్రోక్త విధానంలో నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రధానాచార్యులు బ్రహ్మశ్రీ గబ్బిట ఆంజనేయ శాస్త్రి పర్యవేక్షణలో, కార్యదర్శి సూరి హాసిని నిర్వహణలో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.

# రూ.1.05 కోట్లతో 3 గ్రామాల్లో అభివృద్ధి బాట

### అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు.



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ప్రాధాన్య ఇస్తున్న నేపథ్యంలో పాలకొల్లు మండలంలోని వరిధనం, పెద మామిడిపల్లి, దిగమరు గ్రామాల్లో రూ.1.05 కోట్ల వ్యయంతో నిర్మించిన పలు సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గ్రావెల్ రోడ్లు ను ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు ప్రారంభించారు. వీటికి మంత్రి నిమ్మల రామానాయుడు మంజూరు చేసిన నిధులతో పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మంత్రి రామానాయుడు ప్రత్యేక చొరవ తీసుకుంటూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడటంతో ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులు కూడా మెరుగుపడతాయని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో మంత్రి రామానాయుడు పనిచేస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నారని నాయకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో కూట మి నాయకులు ఏఎంసీ చైర్మన్ కోడి విజయ భాస్కర్, పాముల రజిని కుమార్, ఎమ్మెస్ ఎం ఈ డైరెక్టర్ పోతుల సూరిబాబు, ఎల్లపు లోకేశ్వరరావు, పెచ్చెట్టి నాగరాజు, ద్రాక్షారపు జ్యోతి, నిప్పులేటి నరసింహమూర్తి, వర్ధనపు కాంతారావు, విపర్తి రత్నకుమారి, ఓగిరాలమ జి, పులపర్తి రాజి, గుని శెట్టి కృష్ణ, సిద్దారెడ్డి పండు దిరిశాల కుమార్, బండి పెద్దిరాజు, బండి మహేశ్వరరావు, గుబ్బల కృష్ణమోహన్, తమ్మినిడి చంద్రశేఖర్, రాపాక రాజేంద్రప్రసాద్, రాపాక డేవిడ్ రాజు, కుడకా కోటేశ్వరరావు, రాపాక నగేష్ కరుణాకర్ పి .ప్రసన్నలక్ష్మి, మహిళలు, అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం పట్టణం 28వ వార్డులో గడపగడపకు వైఎస్సార్



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణ పరిధిలోని 28వ వార్డు చింతపల్లి సూరన్న నగర్లో నిర్వహించిన గడపగడపకు వైఎస్సార్ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ , వైఎస్సార్సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఆపార్టీ శ్రేణులుతో పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, స్థానిక అవసరాలను పిల్లి సూర్యప్రకాష్ అడిగి ప్రజల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ 28వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులను గెలిపిస్తే 28వ వార్డు అభివృద్ధికి మరింత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ అండ

### రూ.5 లక్షల బీమా చెక్కు అందజేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. “తెలుగుదేశం పార్టీ అంటేనే ఒక సమిష్టి కుటుంబం అని, కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా పార్టీ అండగా నిలుస్తుంది” అని ఆయన పేర్కొన్నారు. కొత్తపేట మండలం చిన్నగూల్లపాలెం గ్రామానికి చెందిన దివంగత వాసంశెట్టి వెంకన్న కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా మంజూరైన రూ.5 లక్షల బీమా చెక్కును వెంకన్న కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యువ నాయకుడు, మంత్రి నారా లోకేష్ దూరదృష్టితో కార్యకర్తల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి, ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన వేలాది మంది కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. వాసంశెట్టి వెంకన్న మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమమే పార్టీ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని ఆయన స్పష్టం చేశారు.

## వైన్ షాప్ రెవిన్యూవల్ విధానం వద్దే వద్దు (రేఖపల్లి గ్రామస్తులు)



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

కొత్తగా టెండర్లు పిలిచిన తర్వాతే వైన్ షాప్ నడపాలి, కానీ ప్రభుత్వం అలా చేయకుండా వైన్ షాప్ రెవిన్యూవల్ విధానం తీసుకువచ్చిందని, ఈ వైన్ షాప్ రెవిన్యూవల్ విధానం వద్దే వద్దు అని, కొత్తగా టెండర్లు పిలిచిన తర్వాతే వైన్ షాప్ నడపాలనీ అలా జరగకపోతే రేఖపల్లి గ్రామస్తులం అందరం ఏకమై రోడ్డు ఎక్కుతామని వారు పేర్కొన్నారు. బుధవారం రేఖపల్లి సచివాలయంలో పీసా గ్రామసభ పీసా అధ్యక్ష కార్యదర్శులు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకి రేకపల్లి గ్రామస్తులు పాల్గొని రెవెన్యూవల్ విధానం వద్దే వద్దు వైన్ షాపు మెయిన్ రోడ్డు గవర్నమెంట్ హాస్పిటల్, సాయిబాబా గుడి దగ్గరలో ఉండటం వలన పాదాచార్యులు వాహనదారులు హాస్పిటల్ కి వచ్చే రోగులు నానా అవస్థలు పడుతున్నారని, రెవెన్యూవల్ విధానాన్ని ఆపాలని రేఖపల్లి పిసా అధ్యక్ష కార్యదర్శులకు, పంచాయతీ కార్యదర్శి కి దరఖాస్తు అందించారు. గ్రామస్తుల అభిప్రాయానికి వ్యతిరేకంగా వైన్ షాపులు నడపాలని చూస్తే గ్రామస్తులంతా ఏకమై ఆందోళనలు రాస్తారోకోలు చేస్తామని పత్రికా ముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కుల పెద్దలు, రేకపల్లి గ్రామస్తులు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బోగోలులో రేషన్ బియ్యం పట్టివేత.



ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం బోగోలు గ్రామంలో మూడు టన్నుల అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని ధర్మాజీ గూడెం పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారంతో ధర్మాజీగూడెం ఎస్సై కె. వెంకన్న తన సిబ్బందితో కలిసి బోగోలు గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన చలమాల జోషి ఇంటి వద్ద మూడు టన్నుల రేషన్ బియ్యం పట్టుబడినట్లు తెలుస్తోంది. పోలీసులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ధర్మపురి ఎస్సై వెంకన్న తెలిపారు.

# ప్రజాభూమి

జనరల్

గురువారం, సెప్టెంబర్ 17, 2026




## అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఉంటాం:మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి



మచిలీపట్నం 31వ డివిజన్ శారదానగర్‌కు చెందిన పులివర్తి సురేష్ ఇంటిలో జరిగిన అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అగ్నిప్రమాదం కార ణంగా ఇంటికి జరిగిన నష్టాన్ని తెలుసుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ సాయం అందించడంతో పాటు, ప్రభుత్వం తరఫున అవసరమైన అండదండలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

## కృష్ణా విశ్వవిద్యాలయంలో ఘనంగా ప్రపంచ ఓజోన్ దినోత్సవం




మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి : ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ విభాగం ఆధ్వ ర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చా రు. పర్యావరణ పరిరక్షణలో యువ త పాత్రను చాటిచెప్పే లక్ష్యంతో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఎన్‌సీసీ విద్యా ర్థులు పాల్గొన్నారు.ఓజోన్ పొర పరిరక్షణ, పర్యావరణాన్ని కాపాడుకోవడం, భావితరాలకు స్వచ్ఛ మైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఓజోన్ పొర పరిరక్షణపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తూ ప్రకృతి సంరక్షణకు కట్టుబడి ఉంటామని సంకల్పించారు.ఓజోన్ పొరను పరిరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై విద్యా ర్థులు, యువతలో మరింత అవగాహన పెంపొందించేలా భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ విద్యార్థులు, సహాయ ఎన్‌సీసీ అధికారి, 16(ఏ) ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ శిక్షణ సిబ్బంది పాల్గొ న్నారు. కార్యక్రమాన్ని కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ విభాగం, 16(ఏ) ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## పెడన కలంకారి పరిశ్రమల్లో ప్రమాదకర రసాయనాల వినియోగంపై విచారణకు ఆదేశాలు

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి:

పెడన కలంకారి పరిశ్రమల్లో రంగుల తయారీకి క్యాన్సర్ కారకమైన ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తున్నారనే ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఆదేశించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేశారు.పెడన ప్రాంతంలో కలంకారి వస్త్రాల తయారీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ పరిశ్రమపై ఆధారపడి సుమారు 15 వేల మంది జీవనం సాగిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కలంకారి వస్త్రాల తయారీలో సహజసిద్ధమైన రంగులను వినియోగించాల్సి ఉండగా, కొందరు పరిశ్రమల నిర్వాహకులు ప్రమాదకరమైన రసాయనాలను వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఈ రసాయనాల వినియోగం వల్ల పెడన పరిసర గ్రామాల్లో నీరు, వాయు కాలుష్యం ఏర్పడటంతో పాటు కాలువల్లోని నీరు కలుషితమవుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలంకారి పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలి పారు.ఈ అంశంపై జూన్ 20న రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, లోకాయుక్త ఆదేశాల మేరకు పర్యావరణ, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి స్పందించారు. కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యూనిట్ ఫారం ఫర్ ఆర్టిపి కాంపౌండ్ ప్రతినిధులు జంపాన శ్రీనివాస్ గౌడ్, బేతపూడి జోగేశ్వరరావు సిరివెళ్ల గౌరీ ఫిర్యాదు మేరకు ఆదేశాలు జారీ చేశారు.

## చేయి చేయి కలిపారు... పూడిక తొలగించారు

### రైతులు శ్రమదానం తో బిర బిరా కదులుతున్న నీరు

ప్రజాభూమి ప్రతినిధి

అవనిగడ్డ



ఎల్ ఎ నినో ప్రభావంతో వర్షా భావ పరిస్థితులు ఏర్పడి సాగునీరు అంతంతమాత్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేయి చేయి కలిపి శ్రమదానంతో కాలువలో పూడుకుపోయిన తూటి కాడ, కలుపు మొక్కలను తొలగించారు మండలంలోని 11/1 బ్రాంచ్ కాలువ మోపిదేవి నుండి వెంకటాపురం వరకు మూడున్నర కిలోమీటర్ల మేర ఉంది. కాల్వ కింద 500 ఏకరాలకు పైగా సాగు చేస్తున్నారు. తోటి కాడ కలుపు జాతి మొక్కలు అల్లుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. ఆయకట్టు పరిధిలోని రైతులు నేరుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మూడున్నర కిలోమీటర్ల మేర కాలవలో ఉన్న గడ్డి జాతి మొక్కలను తొలగించి సాగునీటి ప్రవాహాన్ని పరుగులెత్తించారు. కలుపు జాతి మొక్కలను తొలగిస్తూ ఉండటంతో అడ్డంకులు తొలగిపోయి ఉరకలెత్తుతున్న నీటిని చూసి రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



# కష్టం నుండి శిఖరానికి వ్యవసాయ కుటుంబం నుండి పారిశ్రామికవేత్తగా ఎదిగిన వీర్నాల బాలాజీ



నేడు వీర్నాల ఫౌండేషన్ అధినేత బాలాజీ జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం



మచిలీపట్నం/గూడూరు, ప్రజాభూమి ప్రతినిధి

చెమటను నమ్ముకున్న చేతుల్లోనే చరిత్ర పుడుతుందనడానికి నిదర్శనం వీర్నాల బాలాజీ జీవితం. కృష్ణా జిల్లా గూడూరు మండలం, కోకా నారాయణపాలెం అనే చిన్న గ్రామంలో, ఒక నిరుపేద రైతు కుటుంబంలో పుట్టి, నేడు అమెరికాలో పారిశ్రామికవేత్తగా ఎదిగి, తిరిగి తన సొంత గడ్డకు సేవ చేయాలనే తపనతో పరితపిస్తున్న యువ కెరటం ఆయన.

**మట్టి పరిమళం నుండి మొదలైన ప్రస్థానం**

వీర్నాల శేషగిరిరావు కుటుంబ వారసత్వంగా వచ్చిన కష్టాన్ని ఆస్తిగా నమ్ముకున్న వ్యక్తి వీర్నాల నాంచారయ్య కొబ్బరికాయల వ్యాపా రం, వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొ చ్చిన ఆయన, రెండవ కుమారుడిగా బాలాజీకి జన్మనిచ్చారు. ఆదిలక్ష్మి ఒడిలో పెరిగిన బాలాజీ బాల్యం అంతా ప్రభుత్వ పాఠశాల గోడల మధ్య నే సాగింది. కార్పొరేట్ హంగులు, ప్రైవేటు విద్యకు నోచుకోని ఆ బాల్యంలోనే, భవిష్యత్తును శాసించే పట్టుదల మొలకెత్తింది.జీవనోపాధి కోసం తండ్రి హైదరాబాద్ కు వలస వెళితే, కొడుకుగా తండ్రికి అండగా నిలిచి, పగలు చదు వు, సాయంత్రం కష్టం అనే సూత్రాన్ని నమ్ము కున్నారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా, చదువునే తన ఆయుధంగా మలచుకున్నారు. పట్టుదలతో డిగ్రీ పూర్తి చేసి, అమెరికా గడ్డపై MS పూర్తి చేసి, అక్కడే సొంత సామ్రాజ్యాన్ని స్థాపించిన ధీశాలి.

**అమెరికా సంపాదన - మచిలీపట్నం కోసం సేవ**

సాధారణంగా అమెరికా వెళ్లిన ప్రతి ఒక్కరూ అక్కడే స్థిరపడాలని కలలు కంటారు. కానీ బాలాజీ ఆలోచన భిన్నం. "నేను ఎక్కడికి వెళ్లినా నా వేర్లు నా పల్లెలోనే ఉన్నాయి" అని చాటి చెప్పారు. తాను సంపాదించిన ప్రతి రూపాయిలో ఒక భాగం తన గ్రామ అభివృద్ధికి అంకితం చేశారు. వ్యాపారం అంటే లాభాపేక్ష కాదు, సామాజిక బాధ్యత అని నిరూపించిన కర్మయోగి ఆయన.

**సేవకు చిరునామా - వీర్నాల ఫౌండేషన్**

సేవను ఒక వ్యవస్థగా మార్చాలనే సంకల్పంతో 05 జూలై 2023న వీర్నాల ఫౌండేషన్ ను స్థాపించారు. విద్య, వైద్యం, క్రీడలు, గ్రామీణాభివృద్ధి అనే నాలుగు స్తంభాలపై ఈ ఫౌండేషన్ ను నడుపుతున్నారు.

ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలు కూడా ప్రపంచంతో పోటీ పడాలనే ఆయన కల అందుకే -- చదరంగం పోటీలతో ఏకాగ్రతను,- గణిత, సైన్స్ ఒలింపియాడ్ లతో శాస్త్ర విజ్ఞానాన్ని,- క్విజ్, డిబేట్ లతో వాక్చాతుర్యాన్ని పిల్లల్లో నింపుతున్నారు.

**P4 తో అభివృద్ధికి బాట**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి P4 విధానానికి నిజమైన ప్రతిరూపం బాలాజీ. మచిలీపట్నం నియోజకవర్గంలోని వెనుకబడిన గ్రామాలను దత్తత తీసుకుని, ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టేందుకు సొంత నిధులతో RO వాటర్ ప్లాంట్లు, డిజిటల్ పాఠశాలలు, యువతకు ఉపాధి శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పండుగలకు కూడా కొత్త భాష్యం చెప్పారు. సంక్రాంతి అంటే కోడి పందాలు కాదు, 3K RUN తో ఆరోగ్యం, STEM గేమ్స్ తో విజ్ఞానం పంచాలని నిరూపించారు.

**యువతకు స్ఫూర్తి ప్రదాతకు జన్మదిన శుభాకాంక్షలు**

కష్టాన్ని ఇష్టంగా మార్చుకుని, శిఖరాన్ని అధిరోహించిన బాలాజీ కి నేడు జన్మదినం. ఈ సందర్భంగా గూడూరు, మచిలీపట్నం ప్రజలు, ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన సేవలు ఇలాగే కొనసాగాలని మనసారా కోరుకుంటున్నారు.



## ఆచార్య నారిశెట్టి వేంకట కృష్ణారావు రచించిన "రెక్కలు విప్పిన గాలి" కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం తెలుగు & ప్రాచ్య భాషా విభాగం ఆధ్వర్యంలో ఆచార్య నారిశెట్టి వేంకట కృష్ణారావు రచించిన "రెక్కలు విప్పిన గాలి" కవితా సంపుటి ఆవిష్కరణ మరియు అంకితోత్సవం ఘనంగా జరిగింది. డైక్మన్ ఆడిటోరియంలో ఆచార్య వి.బాలమోహన్ దాస్ సెమినార్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య కె.గంగాధరరావు సభాధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా గ్రంథావిష్కర్తగా డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ విచ్చేసి ఆవిష్కరించారు. ముందుగా స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కవితా సంపుటిని రచయిత మాజీ పార్లమెంటు సభ్యులు, మాజీ విద్య, హరిజన సంక్షేమశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, మత్స్య శాఖ, విద్యా సాంస్కృతిక వ్యవహారాల శాఖ, సహకార శాఖల మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణా రావుకి అంకితం చేశారు.

సభలో విశిష్ట అతిథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఇంచార్జి చైర్మన్ ఆచార్య ఎస్. విజయ భాస్కరరావు, అతిధులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఆర్. శివరామప్రసాద్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎమ్.సురేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఆత్మీయ అతిథి పల్నాడు జిల్లా నరసరావుపేట వాగ్దేవి విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రత్యేక అతిథి కీ.శే. కవి ఎమ్. సుగమ్ బాబు సతీమణి ఎమ్.రమాదేవి, ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ఆయుర్వేద వైద్యులు, ప్రపంచ తెలుగు రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి. పూర్ణచందు, విజయనగరం 'రవ్వలు' రూపకర్త డాక్టర్ విశ్వేశ్వరవర్మ భూపతిరాజు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వరెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తెలుగు, ప్రాచ్యభాషా విభాగం శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య ఇ.మాధవి, ఆంధ్ర లయోలా కళాశాల విశ్రాంత ఉపప్రాచార్యులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, మార్కాపురం శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ పుస్తక సమీక్ష చేశారు.




# ఇంధనంలో నీళ్లు వాహనదారులకు కన్నీళ్లు!

### బంకులో నాణ్యత పై అనుమానాలు?? తనిఖీలకు తాళం..

కృష్ణాజిల్లా ప్రజాభూమి బ్యూరో

ఆధునిక జీవన విధానంలో పెట్రోల్, డీజిల్ వినియోగం అత్యంత కీలకంగా మారింది. ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్య, వైద్యం ఇలా నిత్య జీవితంలో ప్రతి పనికీ వాహనాలపై ఆధారపడుతున్న ప్రజలకు ఇంధనం నిత్యావసరంగా మారింది.ఇదే అదును చూసుకొని పలువురు పెట్రోల్ బంకుల యజమానులు వినియోగదారులను మోసం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మచిలీపట్నం నగరం లక్ష్మీ టాకీస్ సెంటర్, నాయుడు బట్టి సెంటర్, రైతు బజార్ సెంటర్, రేవతి సెంటర్, విజయవాడ రోడ్డు, కాలేఖాన్ పేట, బైపాస్ రోడ్, పెడన బైపాస్ రోడ్ వెరశి 11 పెట్రోల్ బంకులు ఉండగా గ్రామీణ ప్రాంతంలో సుల్తానగరం, మంగినపూడి బీచ్, విజయవాడ రోడ్డు గూడూరు మొత్తం 5 పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఈ పెట్రోల్ బంకుల్లో ఇంధనం నాణ్యత, కొలతలపై వినియోగదారులకు అను మానాలు కలుగుతున్నాయి. పెట్రోల్ బంకుల కు సంబంధించిన అధికారులు తరచుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించక పోయినా అప్పుడప్పుడైనా తనిఖీలు నిర్వహించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి . ముఖ్యంగా పెట్రోల్‌లో నీరు కలిసిన ఇంధనం విక్రయించడంతో వాహనాలు మొరాయించి, మరమ్మతుల కోసం వినియోగదారులు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇటీవల గూడూరు లోని పెట్రోల్ బంకులో నీరు కలిసిన పెట్రోల్ పోయడంతో ఓ వైద్యురాలు కారు మొరాయించింది. కారు స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్ షెడ్డు కు తరలించగా పెట్రోల్ లో నీరు కలిసిందని చెప్పడంతో ఆమె పెట్రోల్ కల్తీ జరిగిందని గుర్తించింది. ఉచితంగా వచ్చిన వర్షపు నీరును లీటర్ 120 రూపాయలకు అమ్మటం తీవ్ర దిగ్రాంతం వ్యక్తం చేసింది. నీరు చేరిన పెట్రోల్ అమ్మడం వైద్యురాలు సోషల్ మీడియా వేదికగా తనకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు తెలిపింది. అయినా అధికారులు తనిఖీలు నిర్వహించలేదు. సోషల్ మీడియా వేదికగా పలువురు ఈ సమస్యపై అధికారులను ప్రశ్నించారు. పెట్రోల్ వ్యాపారంలో ప్రభుత్వ సంక్షేమ సంఘాల పేర్లతో బంకులు ప్రారంభించడం తో అధికారులు తనిఖీ చేయడానికి సుముఖంగా లేరని తెలుస్తోంది. ఈ సంక్షేమ సంఘాల పెట్రోల్ బంకులు నాణ్యత, కొలతల పై కొంతమంది వినియోగదారుల నుండి ఆరోపణలు ఎదురవుతున్నాయి..పోలీస్, రెవిన్యూ, అగ్నిమాపక డిపా ర్ట్మెం ట్ అ నుబ ంధ ంగా నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులలో పెట్రోల్ నాణ్యత, కొలతలపై కొంతమంది వినియోగదారులకు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందడం లేదు. పెట్రోల్ బంకులు నూతనంగా ఏర్పాటు చేసిన నాటి నుండి ఇప్పటివరకు లీగల్ అండ్ మెట్రాలజీ జిల్లా అధికారి తనిఖీలు నిర్వహించకపోవడం పై పలువురు వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఇంధనం నాణ్యతలో ఏమాత్రం లోపం ఉన్నా దాని ప్రభా వం నేరుగా వాహనదారులపై పడే అవకాశం ఉంది. నగ రంలో పెట్రోల్, డీజిల్ వినియోగించే వాహనదారుల ఇబ్బందులు రోజురోజుకూ పెరుగుతున్నాయనే విమర్శలు కూడా లేకపోలేదు. మచిలీ పట్నం నగరంలో ప్రతిరోజూ వేలాది మంది ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలకు పెట్రోల్, డీజిల్ పోయించుకుంటున్నారు. అయి తే కొన్నిసార్లు బంకులో ఇంధనం పోయించిన కొద్దిసేపటికే వాహనం సక్రమంగా పనిచేయకపోవడం, ఇంజిన్ సమస్యలు తలెత్తడం, వాహనం స్టార్ట్ కాకపోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొంతమంది వినియోగదారులు సమస్యను లేవనెత్తారు. నగరం లో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో ఇంధన నాణ్యతతో పాటు కొలతల విషయంలోనూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. బంకుల్లో ఉపయోగించే డిస్పెన్సింగ్ యంత్రాల కొలతలు సక్రమంగా ఉన్నాయా, వాటి సీళ్లు, పరికరాలు నిబంధనల ప్రకారం ఉన్నాయా, వినియోగదారులకు సరైన పరిమాణంలో ఇంధనం అందుతుందా అనే అంశాలను సంబంధిత లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. కానీ వారానికి ఒక్కరోజు మాత్రమే కృష్ణాజిల్లా లీగల్ మెట్రోలజీ కార్యాలయం తెరిచి ఉంచి మిగతా రోజులు మూసి ఉండటంతో వినియోగదారులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక తలలు పట్టుకుం టున్నారు. ఇంధన నాణ్యతను పరిశీలించే సమయంలో బంకుల నిల్వ ట్యాంకుల్లో నీరు చేరిందా, ఇంధనంలో కలుషిత పదార్థాలు ఉన్నాయా, నిల్వ పంపిణీ ప్రక్రియ నిబంధనల ప్రకారం జరుగుతోందా అనే అంశాలను కూడా పరిశీలించాల్సి ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో భూగర్భ నిల్వ ట్యాంకుల్లోకి నీరు చేరే అవకాశం ఉన్నందున బంకుల నిర్వహణపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మచిలీపట్నం నగరంలో పెట్రోల్ బంకుల సంఖ్య, రోజువారీ ఇంధన వినియోగం దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అదేవిధంగా పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరీక్షించడంతో పాటు కొలతలను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,opposite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

గురువారం 17 సెప్టెంబరు 2026

## అధికారుల సహకారం మరువలేనిది.

-జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ.



ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అభివృద్ధి బాటలో నిలిపేందుకు అధికారులందరూ సమిష్టి కృషితో ప్రభుత్వ పథకాలను అమలు చేయాలనీ జిల్లా పరిషత్తు చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ లో బుధవారం స్థాయి సంఘ సమావేశాలు జిల్లా పరిషత్తు చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నదని , వాటిని పూర్తిస్థాయిలో అమలు చేసి, జిల్లాను అభివృద్ధి పథంలో నిలపడంలో అధికారులది ప్రధాన పాత్ర అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను తెలుసుకుని అభివృద్ధి పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేసి జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అభివృద్ధి పనులు సమయానికి పూర్తి చేయడంతో పాటు, నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో పలు శాఖల ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్తు ఇంచార్జ్ సీఈఓ మల్లికార్జున రావు, డిప్యూటీ సీఈఓ భీమేశ్వర్ గారు, జడ్పీటీసి సభ్యులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పెన్షన్ ఆశావహుల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

ఆగిరిపల్లి మండలం నుంచి 1,693 దరఖాస్తులు డీఆర్డీఏకు పంపింపు:

ఎంపీడీవో అబ్దుల్ సలాం

ప్రజాభూమి ప్రతినిధి- ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండల పరిధిలో కొత్తగా పెన్షన్ పొందేందుకు దరఖాస్తు చేసుకున్న ఆశావహుల దర ఖాస్తుల పరిశీలన ప్రక్రియను అధికారులు వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు. ఆయా గ్రామాల సచివాలయాలకు వచ్చిన దరఖాస్తులను సంక్షేమ సహాయ కులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలను ధ్రువీకరించిన అనంతరం ఎంపీడీవో కార్యాల యానికి పంపిస్తున్నారని తెలిపారు. సచివాలయాల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎంపీడీవో స్థాయిలో మరోసారి పరిశీలించి, అర్హతలు, వివరాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యల కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) కార్యాలయానికి పంపిస్తున్నామని చెప్పా రు. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు ఆగిరిపల్లి మండలం నుంచి మొత్తం 1,693 పెన్షన్ దరఖాస్తులను డీఆర్డీఏ కార్యాలయానికి పంపించినట్లు ఎంపీడీవో అబ్దుల్ సలాం వెల్లడించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా దినోత్సవం.



ప్రజాభూమి ప్రతినిధి- బుట్టాయగూడెం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ భోజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓజోన్ దినోత్సవ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పియువిఎన్. మనీంద్రరావు మాట్లాడుతూ ఓజోన్ పొర భూమికి రక్షణ కవచంగా ఉందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందని అన్నారు. వాతావరణంలో క్లోరో, ఫ్లోరో కార్బన్ ఉద్గారాలను నియంత్రించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఏసీ వంటి ఉపకరణాలను కొనుగోలు చేసేటప్పుడు ఓజోన్ ఫ్రీ, సి ఎఫ్ సి లేబుల్స్ చూసి కొనుగోలు చేయాలని సూచించారు. ఓజోన్ పొర సంరక్షణపై విద్యార్థులు నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ ఎం మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఓజోన్ పొర సంరక్షణ కోసం విద్యార్థులు ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల సిబ్బంది ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్కను నాటుతామని ప్రత్యేక చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వడ్డాది శ్రీనివాస్, కె.శ్రీను, డాక్టర్ కె. శాంతి బాబు, తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు ఎక్సైజ్ కార్యాలయంలో అధికారుల తనిఖీ



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

నూజివీడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఏలూరు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి. శ్రీలత, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ. అవులయ్య బుధవారం తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం నూజివీడు పరిధిలోని 20 మద్యం దుకాణాల పునరుద్ధరణ ప్రక్రియపై నిర్వాహకులకు అవగాహన కల్పించి, ఈ నెల 21లోపు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. గడువులోగా పునరుద్ధరణ చేసుకోని దుకాణాలకు తదుపరి కేటాయింపులో లాటరీ విధానం అమలు చేస్తామని తెలిపారు. అలాగే నూజివీడు సర్కిల్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన 'మార్పు' కార్యక్రమం ద్వారా సారా తయారీకి దూరంగా ఉండేలా అవగాహన కల్పించి, జీవనోపాధి అవసరమున్న 30 మందికి చేపల పెంపకం, మాంసం దుకాణాలు, ఫ్యాన్సీ, కిరాణా దుకాణాలు తదితర రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు దూరంగా ఉండాలని సూచించారు.

## నూజివీడు నియోజకవర్గాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు





ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు, సిబ్బందితో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గాన్ని త్వరలో పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించి యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో తుక్కులూరులో ప్లాంటు, ఆక్వా, శీతల గిడ్డంగులు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, కోకో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అమరావతిలో క్వాంటం సాంకేతికతకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలను రాష్ట్రానికి తీసుకువచ్చి ఇంజనీరింగ్ విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి మండలంలో ఫైబర్‌జాలాన్ని ఏర్పాటు చేసి గ్రామాలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని, తద్వారా ఇంటి నుంచే పనిచేసే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. నూజివీడు బైపాస్‌లో మిగిలిన రెండు కిలోమీటర్ల రహదారి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

## రెవెన్యూ సేవల్లో జాప్యానికి తావులేదు

నిర్ణీత గడువులో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: నూజివీడు సబ్-కలెక్టర్ బి. వినూత్న





ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

నూజివీడు సబ్-కలెక్టర్ కార్యాలయంలో నూజివీడు డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సబ్-కలెక్టర్ బి. వినూత్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, నిర్ణీత గడువులో ప్రజలకు అందించాలని సూచించారు. సచివాలయాల ద్వారా అందుతున్న కేటగిరీ-ఎ, కేటగిరీ-బి సేవలను నిర్దేశిత గడువులో పరిష్కరించడంతో పాటు భూ సమస్యలకు సంబంధించిన ఎఫ్-లైన్, భూమి విస్తీర్ణ సవరణ, అడంగల్ సవరణ, మ్యుటేషన్, ఆన్‌లైన్ ఉప విభజన, 22-ఎ నిషేధిత జాబితా నుంచి తొలగింపు, వెబ్‌ల్యాండ్ తదితర దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డుల ఆధారంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులను కేవలం దరఖాస్తుల పరిష్కారంగా కాకుండా సమస్య వాస్తవంగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన వివరాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అనవసరంగా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం, కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పడం వంటి వాటికి తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలని సబ్-కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో తహశీల్దార్లు, డిప్యూటీ తహ శీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, మండల సర్వే యర్లు, వీఆర్వోలు, వీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారం కోసం కాజులూరులో వీఆర్ఏలు ఆందోళన

ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు



తమ సమస్యల పరిష్కారం కోరుతూ కాజులూరు తాసిల్దార్ కార్యాలయం వద్ద మండల పరిధిలోగల వీఆర్ఏలు సమ్మెబాట పట్టారు. ఈ మేరకు బుధవారం కాజులూరు మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద టెంట్ వేసి తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. వీఆర్ఏలకు పే స్కేల్ ఇవ్వాలని, నామినీలుగా పనిచేస్తున్న విఆర్ఏలను ఒన్ టైమ్ సెటిల్ మెంటు ద్వారా వయస్సుతో నిమిత్తం లేకుండా వీఆర్ఏలుగా రెగ్యులర్ చేయాలని కోరారు. అలాగే అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చకపోతే సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, సభ్యులు, రమణ, సాయిలక్ష్మీ భవాని, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అల్ట్రా మెగా ప్రాజెక్టుగా బీపీసీఎల్ రిఫైనరీ

- రామాయపట్నం పోర్టు వద్ద రూ.1.45 కోట్లతో ప్రాజెక్టు
- త్వరితగతిన ప్రాజెక్టు పనులు ప్రారంభించాలన్న సీఎం
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో బీపీసీఎల్ ఎండీ సంజయ్ ఖన్నా భేటీ
- రిఫైనరీ సమీపంలో 1,500 ఎకరాల్లో పెట్రోకెమికల్స్ పార్క్ ఏర్పాటుకు సీఎం సూచన






ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్ బీపీసీఎల్ చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ కమ్ పెట్రో కెమికల్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రిఫైనరీ సమీపంలో పెట్రో కెమికల్ పార్కును కూడా ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. భారత్ పెట్రోలియం కార్పోరేషన్ సీఎండీ సంజయ్ ఖన్నా ముఖ్యమంత్రితో సమావేశం అయ్యారు. ప్రకాశం-నెల్లూరు జిల్లాల మధ్య ఏర్పాటు కానున్న బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.1.45 లక్షల కోట్లకు చేరిందని ఆయన ముఖ్యమంత్రికి తెలిపారు. ఏడాదికి 9 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రాజెక్టుకు తుది పర్యావరణ అనుమతి సెప్టెంబరు చివరి నాటికి వచ్చే అవకాశం ఉందని బీపీసీఎల్ సీఎండీ సీఎంకు తెలిపారు. ఇంజనీరింగ్ ఇండియా లిమిటెడ్ చేపట్టిన అధ్యయన నివేదిక వచ్చిన వెంటనే ఈ ఏడాది అక్టోబరు నెలలోనే తుది పెట్టుబడి వ్యయం ఖరారు అవుతుందని వివరించారు. ఆ తదుపరి రిఫైనరీ నిర్మాణ పనుల్ని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

### పెట్రో కెమికల్ పార్కు ఏర్పాటుపై సూచన

ప్రాజెక్టులో భాగంగా రిఫైనరీ నుంచి యూరో-6 ప్రమాణాలతో కూడిన ఇంధనం ఉత్పత్తి అవుతుందని బీపీసీఎల్ సీఎండీ ముఖ్యమంత్రికి వివరించారు. మోటార్ స్పిరిట్ , హైస్పీడ్ డీజిల్ , ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ కలిపి సుమారు 5.4 మిలియన్ టన్నులు ఉత్పత్తి కానున్నట్టు తెలియచేశారు. ఇతర పెట్రో కెమికల్స్ ఉత్పత్తులు సుమారుగా 3.2 మిలియన్ టన్నులు ఉంటుందన్నారు. ఉప ఉత్పత్తులుగా హెచ్‌డీపీఈ, ఎల్‌డీపీఈ, ఎల్ఎల్‌డీపీఈ, పాలీప్రొపైలీన్, పాలీ వినైల్ క్లోరైడ్ వంటి బై ప్రోడక్ట్స్ కూడా వస్తాయని వివరించారు. బీపీసీఎల్ రిఫైనరీ నిర్మాణం కోసం అవసరమైన 6 వేల ఎకరాల భూమిలో 75 శాతాన్ని ఇప్పటికే అప్పగించామని ముఖ్యమంత్రి తెలిపారు. మిగిలిన భూమిని అక్టోబరు రెండో వారంలోగా అప్పగిస్తామన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు బీపీసీఎల్ ప్రతినిధులను కోరారు. రిఫైనరీ సమీపంలో సుమారు 1,500 ఎకరాల్లో డౌన్‌స్ట్రీమ్ పెట్రోకెమికల్స్ పార్క్ ఏర్పాటుకు బీపీసీఎల్, ఏపీఐఐసీ కలిసి ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు.

### భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు

భారత్‌లో పట్టణీకరణ, తయారీ రంగం విస్తరణతో పెట్రోకెమికల్స్ కు డిమాండ్ వేగంగా మారుతోందని సీఎం వివరించారు. దేశ పెట్రోకెమికల్ ఇంటెన్సిటీ ఇండెక్స్ ప్రస్తుతం 5 శాతం నుంచి వచ్చే దశాబ్దంలో 15-20 శాతానికి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రిఫైనరీని నిర్మించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ముడి చమురును కేవలం ఇంధనంగా వినియోగించకుండా ఇథిలీన్, ప్రొపైలీన్ వంటి రసాయన ముడి పదార్థాల ఉత్పత్తిని పెంచే విధంగా ఆధునిక రిఫైనరీల రూపకల్పన జరగాలని సీఎం సూచించారు. ప్రాథమిక పాలిమర్లకే పరిమితం కాకుండా అధునాతన మెటీరియల్ విభాగాల్లో పెరుగుతున్న డిమాండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. దేశంలో కెమికల్, పెట్రోకెమికల్ రంగం 2040 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని, ఆ అవసరాలను తీర్చే దిశగా బీపీసీఎల్ పనిచేస్తుందని సీఎండీ సంజయ్ ఖన్నా తెలిపారు. సమావేశంలో బీపీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ వీఆర్‌కే గుప్తా, ఏపీ రిఫైనరీ ఈడీ రాజీవ్, జీఎం రిటైల్ టి.చతుర్వేది, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజం కోసం తల్లి, బిడ్డలకు పోషకాహారం.



ప్రజా భూమి ప్రతినిధి-బుట్టాయగూడెం

ఆరోగ్యవంతమైన సమాజం రూపుదిద్దుకోవడానికి ప్రతి ఒక్క తల్లి బిడ్డకు పోషకాహారం తప్పనిసరిగా అందించాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి యు వి. పద్మావతి అన్నారు. స్థానిక అంగన్వాడి నెం -4 కేంద్రంలో బుధవారం "పోషణ మా " కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి మాట్లాడుతూ ఆరు నెలల నిండిన దగ్గర నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలు , గర్భిణీలు , బాలింతలు మంచి పోషకాహారం తీసుకోవాలని సిడిపిఓ పద్మావతి అన్నారు. సాధ్యమైనంత వరకు ఇంట్లో తయారు చేసిన ఆహార పదార్థాల్ని ఉపయోగించాలని, బయట కొనుగోలు చేసిన జంక్ ఫుడ్స్ పిల్లలకు, గర్భవతులకు, బాలింతలకు ఇవ్వరాదని హెచ్చరించారు. సూపర్వైజర్ ఝాన్సీ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో అందించే పాలు, గుడ్లు, బాలమృతం, బాలసంజీవిని కిట్ లబ్ధిదారులు మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. ఐ టి సి కి చెందిన సిఎస్ఆర్ దెబస్మిత మాట్లాడుతూ మంచి పోషకాహారం తీసుకుంటూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అదేవిధంగా మంచి ఆహారంతో, వ్యాయామంతో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ కె రోజలిన్, ప్రథమ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, అంగన్వాడీ లబ్ధిదారులు, ప్రీస్కూల్ పిల్లలు, తల్లులు, అంగన్వాడి కార్యకర్తలు హాజరైనారు.

## స్థానిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలి



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి పొన్నం కళ్యాణ మండపంలో నూజివీడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అధ్యక్షతన బుధవారం మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ఆగిరిపల్లి మండలంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో, ప్రతి ప్రాంతంలో పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెట్టి ఎన్నికల్లో చురుకుగా పాల్గొనేలా కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన కోరారు.

## అభివృద్ధి పనులకు నేడు మంత్రి పార్థసారథి శంకుస్థాపన



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలోని యాదవుల మండపం నుంచి వరాహ పుష్కరిణి వరకు కొత్తగా నిర్మించనున్న డ్రైనేజీ కాలువకు, నోగొండపల్లి గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణానికి గురువారం మంత్రి కొలుసు పార్థసారథి శంకుస్థాపన చేయనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు నక్కనబోయిన వేణు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.